నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 23-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 213 | పేజీలు:4 | వెల: రూ.1/-

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులు..

జవాన్ మృతి

శ్రీనగర్, ఏప్రిల్ 22:: జమ్మూకశ్మీర్‌లోని సుంజ్వాన్ ఏరియాలో ఉగ్రవాదులు తలదాచుకున్నట్లు భద్రతా బలగాలకు సమాచారం అందింది. స్థానికంగా ఉన్న ఓ ఇంట్లో ఉగ్రవాదులు ఉన్నట్లు సైన్యం గుర్తించింది. ఉగ్రవాదుల కోసం గురువారం రాత్రి అక్కడ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో ఓ జవాను ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు జవాన్లు తీవ్రంగా గాయపడినట్లు జమ్మూ జోన్ ఏడీజీపీ ముఖేష్ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదుల కోసం కూంబింగ్ కొనసాగుతోందని సింగ్ తెలిపారు.

ఏపీ సభ్యులు కావాలనే జీఆర్ఎంబీ భేటీకి రాలేదు: స్పెషల్ సీఎస్ రజత్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 22:గోదావరి నదీ యాజమాన్య బోర్డు (ఉ ఖీఓః) సమావేశం మరోసారి వాయిదాపడింది. ఏపీ సభ్యుల ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి రాలేదని, దీంతో భేటీ వాయిదా పడిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ అన్నారు. బోర్డు చైర్మన్ ఎంపీ సింగ్ అధ్యక్షతన జరగాల్సిన ఈ భేటీకి తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్, సీఎం ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, ఇంజినీర్లు హాజరయ్యారు. కానీ ఏపీకి చెందిన ఒక్క అధికారి కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో బోర్డు ఈ సమావేశాన్ని వాయిదా వేసింది. ఏపీ సభ్యుల గైర్హాజరుతో మార్చి 11న కూడా భేటీ వాయిదా పడింది.

ఏపీ సభ్యులు కావాలనే సమావేశానికి రాలేదని రజత్ కుమార్ అన్నారు. వరుసగా రెండు సార్లు సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ వారు హాజరుకాలేదని చెప్పారు. తెలంగాణకు సంబంధించిన మూడు ప్రాజెక్టుల డీపీఆర్‌లకు బోర్డు ఆమోదం తెలపాలని వెల్లడించారు. ఏపీ సభ్యులు రాకపోవడంతో అనుమతులకు ఆలస్యమవుతోందని చెప్పారు. సీతమ్మసాగర్, తుపాకులగూడెంకు హైడ్రలాజికల్ అనుమతి వచ్చిందన్న తెలిపారు. ఆరు నెలల్లోపు అన్ని ప్రాజెక్టులకు అనుమతి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలపై కేంద్రం ఇంకా ట్రైబ్యునల్‌కు నివేదించడం లేదన్నారు.

ఉక్రెయిన్ నష్టం 60 బిలియన్ల డాలర్లు

కీవ్, ఏప్రిల్ 22:: రష్యా ఆక్రమణతో ఉక్రెయిన్‌లో భారీ విధ్వంసం జరిగింది. బిల్డింగ్‌లు, మౌలిక సదుపాయాలన్నీ ఆ దేశం కోల్పోయింది. అయితే ఆ భౌతిక నష్టం సుమారు 60 బిలియన్ల డాలర్లు ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ప్రస్తుతం యుద్ధం సమయంలో ధరలు మరింత పెరిగాయని, దానికి ప్రకారం ఆర్థిక నష్టం మరింత ఎక్కువే ఉంటుందని భావిస్తున్నారు. యుద్ధం కొనసాగుతున్నా కొద్దీ.. నష్టం విలువ పెరుగుతూనే ఉంటుందని వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్ డేవిడ్ మాల్‌పాస్ తెలిపారు.

తీవ్రమైన ఆర్థిక నష్టం నుంచి కోలుకునేందుకు ప్రతి నెల ఏడు బిలియన్ల డాలర్లు అవసరం ఉంటుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. దేశం మొత్తాన్ని పునర్ నిర్మించాలంటే వందల బిలియన్ల డాలర్లు అవసరం ఉంటుందని ఆయన అన్నారు. రష్యా ఆస్తులను సీజ్ చేసిన దేశాలు ఆ డబ్బును ఉక్రెయిన్ పునర్ నిర్మాణం కోసం వాడాలని సూచన చేశారు. ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ కాన్ఫరెన్స్‌లో వీడియో లింక్ ద్వారా మాట్లాడుతూ జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు.

రేవంత్ ఏ పార్టీలో ఉంటే.. ఆ పార్టీ భూస్థాపితమే : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో ఉంటే.. ఆ పార్టీ భూస్థాపితమేనని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శుక్రవారం రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, ఎగ్గే మల్లేశంతో కలిసి టీఆర్ఎల్పీ కార్యాలయంలో మీడితో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్‌లో నిన్న రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి.. తెలంగాణను హేళన చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దీనమైన స్థితిలో ఉందని, ఆ పార్టీ శవయాత్ర జరుగుతోందన్నారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏంటో తెలిసిందన్నారు. రేవంత్ బీజేపీలో ఉన్న సమయంలో ఆ పార్టీ లేవలేదని, టీఆర్ఎస్ నుంచి రేవంత్ వెళ్లగానే పార్టీ బాగుపడిందన్నారు.

టీడీపీ రేవంత్‌తో ఖతమైందని, కాంగ్రెస్‌లోకి రేవంత్‌రెడ్డి రాక ముందుకు కొన్ని సీట్లు వచ్చాయని.. ఇప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉంటే కాంగ్రెస్‌కు వచ్చేవి నున్నా స్థానాలేనని, ఇది రాసిపెట్టుకోవాలన్నారు. టీడీపీలో మేం తెలంగాణ కోసం కొట్లాడుతుంటే.. రేవంత్ చంద్రబాబు ఏజెంట్‌గా పని చేశారని, రేవంత్ ఎక్కడ కాలు పెడితే అక్కడ భూస్థాపితమేనన్నారు. కాంగ్రెస్‌లోనే రేవంత్‌కు ఎవరూ విలువనివ్వడం లేదని, బయట ఇంకెవ్వరైనా ఇస్తారా ? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం రేవంత్ చేసింది ఏమైనా ఉందా?.. కాంగ్రెస్ హయాంలో సాగునీరు, తాగునీటికి కటకట ఉండేదని, ఇపుడు తెలంగాణలో ఆ సమస్యలు ఉన్నాయా? అన్నారు.

తెలంగాణను నాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ అనీ, రైతుల కోసం పని చేసింది ఇద్దరు ముఖ్యమంత్రులేనన్నారు. ఇందులో ఒకరు ఎన్టీఆర్ అయితే.. మరుకొరు కేసీఆర్ అన్నారు. రైతుబంధు కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.

రైతుల కోసం ఇప్పటి దాకా నువ్వు ఏం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. సిగ్గు లేకుండా రైతు సంఘర్షణ పేరిట సభ పెడుతున్నారని, ముందు కాంగ్రెస్‌లో కొట్టుకు చస్తున్న వారి సంగతి చూడు అంటూ హితవు పలికారు.

రైస్ మిల్లర్లను కేంద్రం వేధిస్తూ రైతుల నుంచి ధాన్యం కొనకుండా కక్ష గట్టిందని, కిషన్ రెడ్డికి రేవంత్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. రేవంత్ వాళ్లతోనే రైతులకు అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. ఇకనైనా రేవంత్ భాష మార్చుకోవాలని హితవు పలికారు.

చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ శ్రీమతి రాధా కృష్ణను
ప్రేమను బొందిన ఘను నిగ - ప్రియుడు ఉన్నాగా
రాముడు విఖ్యాతి సరిసె
తోముల గుణ సంయుతుడు "గోపాలు" నిపై !!

(ఏప్రిల్ 23 సర్వేపల్లి గోపాల్ సన్‌ఆఫ్ రాధాకృష్ణన్ జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పకడ్బందీ చర్యలు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఏప్రిల్ 22:వేసవిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా నూటికి నూరు శాతం సురక్షిత మంచి నీటిని అందించాలి. సీఎం కేసీఆర్ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను అదేశించారు. శుక్రవారం వేసవిలో మంచి నీటి సమస్యల మీద ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సంబంధిత అధికారులు, సర్పంచులతో హైదరాబాద్ మిషన్ భగీరథ కార్యాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ, సమన్వయం చేస్తూ, తగిన విధంగా అధికారులు పని చేయాలని సూచించారు.

పంపుల నిర్వహణ, లీకేజీలు లేకుండా చూసుకోవడం, ఫిల్టర్ బెడ్ల క్లీనింగ్, సమస్యలు ఉత్పన్నం అయితే ప్రత్యామ్నాయాలతో సిద్ధంగా ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సర్పంచుల నుంచి ఆయా గ్రామాల మంచినీటి సరఫరా పై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, సీఎం, మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, ఈఈలు, ఎస్ఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసిన గుండ్ల పొట్లపల్లి గ్రామస్తులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 22:: ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లాలోని రాజాపూర్ మండలం గుండ్ల పొట్లపల్లి గ్రామస్తులు కలిశారు. గుండ్ల పొట్లపల్లి గ్రామం జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్వశక్తి కరణ్ పంచాయతీ పురస్కారం క్రింద 10 లక్షల రూపాయల రివార్డ్ సాధించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వైకుంఠ ధామలు, నర్సరీలు, చెత్త తరలింపునకు ట్రాక్టర్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తున్నారు. దీంతో నేడు గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ సర్పంచ్ డా. రాఘవేందర్ రెడ్డి ని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీశైలం, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కొవిడ్ కేసులు.. కొత్త మార్గదర్శకాలు జారీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: పెరుగుతున్న కొవిడ్ కేసుల మధ్య ఢిల్లీ ప్రభుత్వం మహమ్మారిని ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. పాఠశాలలను మూసివేకుండా కరోనా కట్టడి కోసం కొత్తగా మార్గదర్శకాలను సిద్ధం చేసింది. పాఠశాలల్లో ప్రత్యేక క్వారంటైన్ గదులను సిద్ధం చేయడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యుల పరిస్థితులపై ప్రతి రోజూ సేకరించేలా చూస్తున్నది. ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సమావేశంలో ప్రస్తుతం కరోనా పరిస్థితులు పాఠశాలలను మూసివేయొద్దని నిర్ణయించారు. అయితే, కొత్త ఎస్ఓపీని సిద్ధం చేసి, మహమ్మారిని ఎదుర్కొనేందుకు సన్నాహాలు చేయనున్నారు. ఇందులో భాగంగా ఢిల్లీ ప్రభుత్వం ఏడు పాయింట్లతో ఎస్ఓపీలను జారీ చేసింది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ కరోనా నివారణపై చర్చించాలని ఢిల్లీ ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. అలాగే పిల్లలతో పాటు తల్లిదండ్రులు సైతం టీకా తీసుకునేలా ప్రోత్సహించాలి. పాఠశాలలో ప్రతి ఒక్కరూ మాస్క్‌లు ధరించి ఉండేలా చూడాలి. వాష్ బేసిన్, నీరు తగినంత ఉండేలా ఏర్పాట్లు చేయాలి. పిల్లలు వచ్చి వెళ్లే సమయంలో అన్ని గేట్ల వద్ద రద్దీ లేకుండా ప్రధానోపాధ్యాయులు చూడాలని ఢిల్లీ ప్రభుత్వం చెప్పింది. విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఇతర విద్యార్థులతో పంచుకోకుండా చూడడంతో పాటు తరగతి గదులతో పాటు ఆయా ప్రాంతాలను శానిటైజ్ చేయాలని సూచించింది.

విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు లక్షణాలపై ఆరా తీయాలని సూచించింది. జ్వరం, చలి, దగ్గు, శ్వాస ఆడకపోవడం, కండరాల, ఒంటి నొప్పులు, తలనొప్పి, రుచి లేదంటే వాసన కోల్పోవడం, గొంతు మంట, ముక్కు కారడం, వాంతులు, అతిసారం తదితర లక్షణాలు ఎవరైనా కనిపిస్తే వారిని వేరు చేసి క్వారంటైన్ గదికి పంపాలని ఆదేశించింది. పిల్లల్లో, ఉపాధ్యాయులు, సిబ్బందిలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే తాత్కాలికంగా మూసివేయడంతో పాటు మండలం లేదా జిల్లా అధికారికి తెలియజేయాలని స్పష్టం చేసింది. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పాఠశాల గేట్ల వద్దనే పరీక్షలు చేయాలని చెప్పింది. తద్వారా కొవిడ్ లక్షణాలున్న పిల్లలను అక్కడికక్కడే ఇంటికి పంపొచ్చని పేర్కొంది.

తప్పనిసరిగా విద్యార్థులు, ఉపాధ్యాయుల వరకు ప్రతి ఒక్కరికీ గేట్ వద్దనే థర్మల్ స్కానింగ్ పరీక్షలు చేయని స్పష్టం చేసింది. పాఠశాలకు హాజరైన సమయంలో ఉపాధ్యాయులు కొవిడ్‌పై పిల్లలతో మాట్లాడాలని తెలిపింది. ప్రతి పాఠశాలలో అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా క్వారంటైన్ గదిని ఏర్పాటు చేయాలని, విద్యార్థులు భౌతికదూరం పాటించేలా చూడడంతో పాటు గుమిగూడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. క్యాంపస్ గెస్ట్ పాలసీని నిలిపివేయాలని, అత్యవసర సమయాల్లో అవసరమైన కొవిడ్ నిబంధనల మేరకు తల్లిదండ్రులకు మాత్రమే అనుమతివ్వాలని చెప్పింది. కొవిడ్ నివారణ కోసం అన్ని పాఠశాలల్లో అవగాహన కల్పించాలని చెప్పింది.

పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాల ఏర్పాటు : మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 22: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు ఏర్పాటు చేసుకున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మక్తల్ మున్సిపాలిటీలో స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, జడ్పీ చైర్మన్ వనజమ్మతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ. 1.40 కోట్ల అంచనా వ్యయంతో మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 47.50 లక్షలతో నిర్మించిన మున్సిపాలిటీ డంపింగ్ యార్డు, తడి చెత్తతో వర్మికంపోస్టు తయారు చేసేందుకు నిర్మించిన షెడ్ ను ప్రారంభించారు.

రూ. 47.50 లక్షల వ్యయంతో నిర్మించిన కూరగాయల మార్కెట్ ను ప్రారంభోత్సవం చేశారు.

రూ. 2.00 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా నిర్మించనున్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. రూ.43.20 లక్షలతో కొత్తగా నిర్మించిన పురపాలక సంఘం సమావేశ మందిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాక ముందు 70 సంవత్సరాల్లో తెలంగాణా ఎలా ఉంది? ఆ తర్వాత ఏ స్థాయిలో అభివృద్ధి సాధిస్తుందో గమనించాలని పేర్కొన్నారు.

మక్తల్ మున్సిపాలిటీలో ఏ ఒక్క సౌకర్యం లేకపోయేదని, ఈ రోజు పట్టణ ప్రజలు సేదతీరేందుకు చెరువు దగ్గర మినీ ట్యాంక్ బండ్, మున్సిపల్ కౌన్సిల్ హాల్, సమీకృత మార్కెట్ ఇలా ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు. రూ. 55 లక్షలతో మున్సిపాలిటీ కార్యాలయ నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం లభించనుందని తెలియజేసారు.

కౌన్సిలర్లు, అధికారులు అందరూ కలిసిమెలిసి పని చేసి మక్తల్ మున్సిపాలిటికి సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పద్మజా రాణి, మున్సిపల్ చైర్మన్ పావని, వైస్ చైర్మన్ అఖిల, మార్కెట్ యార్డు చైర్మన్ రాజేష్ గౌడ్, డి.సి.సి.బి. చైర్మన్ నిజాంపాషా, మున్సిపల్ కమిషనర్ నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి..25 మందికి గాయాలు

చేర్యాల, ఏప్రిల్ 22 : ఉపాధిహామీ కూలీల పై తేనెటీగలు దాడి చేయడంతో గాయాలపాలై దవాఖానలో చికిత్సపొందుతున్నారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..గ్రామంలోని పెద్ద చెరువు కట్ట పై ఉపాధిహామీ పనుల్లో భాగంగా జంగిల్ కటింగ్ చేసేందుకు సంబంధిత అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఉదయాన్నే 150 మంది కూలీలు పెద్ద చెరువు కట్ట పై చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించే పనులు ప్రారంభించారు.

కట్ట పై ఉన్న చెట్లను ఒక్కొక్కటిగా తొలగిస్తున్న క్రమంలో తేనెతెట్టె ఉన్న విషయాన్ని గుర్తించకుండా ఉపాధి కూలీలు చెట్టును కొట్టడడంతో ఒక్కసారిగా తేనెటీగలు కూలీల పై దాడి చేశాయి. ఈ ఘటనలో 25 మంది కూలీలు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూలీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

మోదీ, మాల్యాను భారత్‌కు అప్పగిస్తాం.. యూకే ప్రధాని బోరిస్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ కీలక ప్రకటన చేశారు. బ్యాంకులకు రుణాలను ఎగ్గొట్టి, విదేశాలకు పారిపోయిన.. నీరవ్ మోదీ, విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వారిని కచ్చితంగా భారత్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు. భారత పర్యటనలో భాగంగా బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ రెండో రోజు ప్రధాని మోదీతో ఇవ్వాల భేటీ అయ్యారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. అయితే ఇలా అప్పగించేందుకు కొన్ని చట్టాలున్నాయని గుర్తు చేశారు.

చట్టాలను ఎగవేసి, మా దేశానికి వచ్చేవారిని ఎంత మాత్రమూ ఉపేక్షించమని, అలాంటి వారిని స్వాగతించమని కూడా స్పష్టం చేశారు. భారత చట్టాల నుంచి తప్పించుకొని, తమ దేశ చట్టాలను వాడుకోవాలని చూసే వారిపై తాము కఠినంగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. అలాగే బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న ఖలిస్తానీ గ్రూపులపై కూడా ఆయన స్పందించారు. వారి విషయంలో యాంటీ టెర్రరిస్ట్ టాస్క్ ఫోర్స్‌ను నియమించామని, అతి తొందర్లోనే వారిపై కూడా తగు చర్యలు తీసుకుంటామని జాన్సన్ ప్రకటించారు.

సచిన్ టెండూల్కర్, అమితాబ్ బచ్చన్‌లా ఫీలయ్యా: బ్రిటన్ ప్రధాని బోరిస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:భారత పర్యటనపై బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా ఆయన రెండో రోజు ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై ఇరువురూ చర్చించారు. మొదటి రోజు గుజరాత్ పర్యటనలో తనకు లభించిన స్వాగతానికి బోరిస్ జాన్సన్ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ఇంత ఘనంగా తనకు స్వాగతం పలికినందుకు ప్రధాని మోదీకి, భారత ప్రజలకు నా ధన్యవాదాలు చెప్పారు. తన స్వాగత హోర్డింగులు చూసి.. ఓ సచిన్ టెండూల్కర్‌లా, అమితాబ్‌లా ఫీలయ్యాను అని బోరిస్ జాన్సన్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఓ నిఖార్సైన స్నేహితుడని చెప్పారు.

భారత్ తో బంధాన్ని మరింత దృఢం చేసుకునే అనేక అంశాలపై తాము చర్చించామని బోరిస్ జాన్సన్ స్పష్టం చేశారు. పలు వస్తువులు, సామగ్రిపై భారత్ టారిఫ్ లను తగ్గించడం అభినందనీయమని, అందుకు బదులుగా తాము కూడా కొన్ని టారిఫ్ లను తగ్గిస్తున్నామని ప్రకటించారు. రక్షణ పరికరాలు, ఉత్పత్తులకు సంబంధించి డెలివరీ టైమ్ ను తగ్గిస్తున్నామని, భారత్ కు ప్రత్యేకంగా జనరల్ ఎక్స్‌పోర్ట్ లైసెన్స్ ను రూపొందిస్తున్నామని చెప్పారు. రక్షణ రంగంలో సరికొత్త విస్తృత భాగస్వామ్యానికి నాంది పడిందన్నారు. ఇండో పసిఫిక్?రీజియన్ లో భద్రతను పెంపొందించేందుకు భారత్ తో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు.

పంచభూతాల వల్లనే మానవ మనుగడ: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22:పంచభూతాల వల్లనే మానవుల అస్తిత్వానికి, సకల జీవజాలం మనుగడ సాధ్యపడుతుందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. ప్రకృతికి ప్రతిరూపాలైన నేల, నీరు, నిప్పు, గాలి, ఆకాశం సకల జీవుల మనుగడకు ఆలంబనలు వీటిలో ఏ ఒక్కటి లోపించిన ప్రాణకోటి అస్తవ్యస్తం అవుతుందని చెప్పారు. ప్రాణకోటికి అనుకూలంగా ఉన్న ఏకైక గ్రహం భూమి అని, భూ గ్రహాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శుక్రవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. మన గ్రహంపై మదుపు అనే థీమ్ తో ఈ ఏడాది ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.

భూ గ్రహాన్ని పునరుద్ధరించడానికి, ప్రపంచ పర్యావరణ వ్యవస్థలను పునర్నిర్మించడంపై మన వంతు కృషి చేయాలని ఈ థీమ్ సూచిస్తుందన్నారు. మన ఆరోగ్యాన్ని, మన కుటుంబాలను, జీవనోపాధిని కాపాడుకోవడానికి, రక్షించుకోవడానికి భూమాతను సంరక్షిద్దామని పిలుపునిచ్చారు.ఆకుపచ్చని తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పరిశుభ్రత, పచ్చదనమే ప్రధాన లక్ష్యంగా పల్లె,పట్టణ ప్రగతి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్ట్ ల నిర్మాణం వల్ల నీటి లభ్యత పెరిగిందని, దీని వల్ల జీవవైవిధ్యం వృద్ధి చెందిందని పేర్కొన్నారు.

ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి : మంత్రి సబితారెడ్డి



చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 22 : మాజీ హోం మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి 22వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చిట్టంపల్లి గేట్ సమీపంలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి మంత్రి సబితారెడ్డి ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డితో కలిసి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కాగా, ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమాజిగూడలోని ఏఐజీ దవాఖాన సౌజన్యంతో కౌకుంట్ల గ్రామంలో వారం రోజులుగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రజల ముద్దు బిడ్డగా.. బడుగు బలహీన వర్గాలకు బాసటగా.. నిస్సహాయులకు నీడగా, పేద ప్రజలకు అండగా నిలిచిన ఇంద్రారెడ్డి తుది శ్వాస వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పరితపించారన్నారు.

ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పటేల్, డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జడ్పీటీసీ మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, సర్పంచ్‌లు గాయత్రి, సులోచన, శేరి శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ సాహిత్య చరిత్రలో షేక్స్‌ఫియర్ అద్యుడు

(23 ఏప్రిల్ 'విలియమ్ షేక్స్‌ఫియర్ జయంతి, వర్ధంతి' సందర్భంగా)

23 ఏప్రిల్ 1564న ఇంగ్లాండ్, స్టాన్ఫర్డ్‌లోని తోలు వ్యాపారి కుటుంబంలో మేరీ ఆర్డన్, జాన్ షేక్స్‌ఫియర్ దంపతులకు జన్మించిన విలియమ్ షేక్స్‌ఫియర్ 26 ఏప్రిల్‌న బాప్టిజమ్ స్వీకరించారు. విలియమ్ షేక్స్‌ఫియర్ తల్లితండ్రులతో పాటు సంతానం కూడా నిరక్షరాస్యులే అయినప్పటికీ విలియమ్ షేక్స్‌ఫియర్ మాత్రమే ప్రపంచ ఆంగ్ల సాహిత్య చరిత్రలో చెరగని ముద్రను వేశారు. ప్రఖ్యాత నాటక రచయిత, కవి, రంగస్థల నటుడైన షేక్స్‌ఫియర్ స్ట్రాట్‌ఫర్డ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. 'ఇంగ్లాండ్ జాతీయ కవి'గా పేరుగాంచిన షేక్స్‌ఫియర్ 39 నాటకాలు, 154 సోనెట్స్, మూడు దీర్ఘ కవితలు, ఇతర రచనలు ఎన్నో చేశారు. వారు రచించిన అత్యద్భుత నాటకాలను అనేక ప్రపంచ భాషల్లోకి కూడా అనువదించారు. తన 18వ ఏట 26 ఏండ్ల వయస్సుగల 'అన్నే హాత్‌వే'ను వివాహమాడి ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చారు. ప్రథమ సంతానంగా 1583లో కూతురు 'సుసన్నా', 1585లో కవల పిల్లలు 'హామ్‌నెట్', 'జూడిత్'లు జన్మించారు.

1985 తరువాత 7 సంవత్సరాలు ఏమి చేశారో తెలియని (బహుశ ఉపాధ్యాయుడిగా లేదా వేటగాడిగా చేసి ఉండవచ్చని) అజ్ఞాత చరిత్రను 'లాస్ట్ ఇయర్స్'గా రికార్డు చేశారు.

షేక్స్‌ఫియర్ ప్రముఖ రచనల్లో హామ్లెట్, రోమియో అండ్ జూలియట్, ఒథెల్లో, కింగ్ లియర్, కింగ్ జాన్, జూలియస్ సీజర్, క్వీన్ ఎలిజెబెత్, మర్చంట్ ఆఫ్ వెన్నిస్, 3 భాగాల హెన్రీ ?ఎ, కామెడీ ఆఫ్ ఎరర్స్, ది టెంపెస్ట్, మాక్‌బెత్ లాంటి అనేక సాహిత్య కళాఖండాలు ఉన్నాయి.

నాటి సాంప్రదాయ కుటుంబ శైలికి దగ్గరగా ఉండేలా, నూతనత్వం మేళవించి, ప్రేమల నుండి యుద్ధాల వరకు ఆకర్షణీయంగా, వాస్తవానికి దగ్గరగా, తనదైన సరళ శైలిలో తన రచనలను చేశారు. విశ్వవిద్యాలయ విద్య కూడా చదవని విలియమ్ షేక్స్‌ఫియర్ తన జీవిత కాలంలో హాస్య, ప్రేమకథా, చారిత్రక, విషాద రచనలు ఎన్నో చేశారు. తన వ్యక్తిగత జీవితం గూర్చి స్పష్టమైన వివరాలు తెలియనప్పటికీ, ఆయన రచనల్లో మానవీయ భావోద్వేగాలు, సంఘర్షణలు గత నాలుగు శతాబ్దాలుగా కొనయాడబడుతున్నవి.

విలియమ్ షేక్స్‌ఫియర్ ప్రపంచ ప్రఖ్యాత అత్యుత్తమ ఆంగ్ల సాహిత్యకారుడే అయినప్పటికీ, అతని జీవిత విశేషాలు సవివరంగా తెలియక పోవడం విచారకరం. తన జన్మదినం రోజుననే తన 52వ ఏట 23 ఏప్రిల్ 1616న తుది శ్వాస విడవడం జరిగింది.

విలియమ్ షేక్స్‌ఫియర్ భౌతికంగా మన ముందు లేకపోయినా, తన నాణ్యమైన రచనలు కాలం ఉన్నంత వరకు మనల్ని నడిపిస్తూ, ఉల్లాస పరుస్తూ, జీవిత కష్ట సుఖాలను రుచి చూపిస్తూ, విశ్వ మానవాళికి మార్గదర్శకంగా ఉంటాయనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

డ్వాక్రా మహిళలకు మూడో విడత రూ.1261కోట్లు చెల్లిస్తున్నాం - సీఎం జగన్

అమరావతి, ఏప్రిల్ 22:డ్వాక్రా మహిళలకు మూడో విడత సున్నా వడ్డీ కింద రూ.1261కోట్లు చెల్లిస్తున్నామని, మహిళాలకు అండగా వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఒంగోలు బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సాధికారత సారథులకు అభినందనలు.

తొలి ఏడాది సున్నా వడ్డీ కింద రూ.1258 కోట్లు చెల్లించాం. రెండో ఏడాది సున్నా వడ్డీ కింద రూ.1096 కోట్లు చెల్లించామన్నారు. వరుసగా మూడో ఏడాది రూ. 1261 కోట్లు చెల్లిస్తున్నామని అన్నారు. గడిచిన మూడేళ్లలో రూ.3165 కోట్లు అక్కాచెల్లెమ్మలకు చెల్లించామన్నారు. కోటి 2లక్షల 16 వేలమందికి పైగా అక్క చెల్లెమ్మలకు మేలు కలిగింది. గతంలో 12శాతం దాకా వడ్డీలు కట్టాల్సి వచ్చేదన్నారు. అక్కచెల్లెమ్మలకు మంచి జరగాలని గత ప్రభుత్వం ఆలోచించలేదన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిన పరిస్థితులున్నాయి. కానీ మన ప్రభుత్వంలో ప్రతి ఏడాది మహిళలకు భరోసా ఇస్తున్నామని సీఎం జగన్ తెలిపారు.

హంద్రీనీవా ఇంజనీర్లతో మంత్రి జయరాం సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 22:కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం పరిధిలోని 28, 29 ప్యాకేజీ పరిధిలోగల పెండింగ్ పనులను సత్వరమే పరిష్కరించే నిమిత్తం.. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం హంద్రీనీవా ఇంజనీర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గంలో గల తన నివాసంలో ఏర్పాటుచేసిన సమీక్షకు హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ నాగరాజు, కర్నూల్ సర్కిల్ ఎస్ఇతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఇంజనీర్లు హాజరయ్యారు. సమీక్షలో భాగంగా ముందుగా హంద్రీ నీవా ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. 28, 29 ప్యాకేజీ పరిధిలోగల పెండింగ్ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు పరిధిలో 88 ఎకరాల భూ సేకరణ, ఇతర పనులపై చర్చ జరిగింది. ఆయా పనులను పూర్తి చేసేందుకు రూ. 123 కోట్ల వరకు అవసరం అవుతుందని ఇంజనీర్లు మంత్రి గుమ్మనూరు దృష్టికి తెచ్చారు. అయితే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి.. నిధులు విడుదల చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

మొత్తంగా ఈ నెల 17వ తేదీన ఆలూరు నియోజకవర్గం పరిధిలో హంద్రీనీవా పనుల పెండింగ్ పై ఆంధ్రప్రభ మెయిన్ సంచికలో ప్రత్యేక కథనం ప్రచురించడం జరిగింది. దీంతో గత రెండున్నర ఏళ్లుగా ఏ నాడు హంద్రీ నీవా ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించనీ మంత్రి .. ప్రస్తుతం ఆంధ్రప్రభ కథనంతో.. ప్రాజెక్టు ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించడం గమనార్హం. వీటితో పాటు ఆస్పరి మండలం లో హంద్రీ–నీవా నుంచి చెరువులకు నీరు నింపే విషయంలో కూడా మంత్రి గుమ్మనూరు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడం విశేషం.

ట్రాఫిక్ పోలీసుల సేవలు గుర్తించాలి: కరీంనగర్ సిపి

కరీంనగర్ , ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): మండుటెండల్లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను గుర్తించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీసులకు లైఫ్ లైన్ ఆస్పత్రి వారిచే కూలింగ్ గ్లాసెస్, కరీంనగర్ డైరీ వారిచే మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమ సిబ్బంది మండుటెండల్లో సైతం సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ విజయ్ కుమార్, లైఫ్ లైన్ ఆసుపత్రి ప్రశాంత్ తో పాటు కరీంనగర్ డైరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం -భాషా సాంస్కృతిక శాఖ
సత్కళా భారతి
ఆహ్వానం



ప్రముఖ నృత్య గురు, రచయిత్రి
హంస పురస్కార గ్రహీత
డా॥ మద్దాళి ఉషాగాయత్రి
రచించిన
మౌనమే సాక్షిగా
(నవల) ఆవిష్కరణ
మంగళవారం 26-04-2022
సా॥ 6 గంటలకు
రవీంద్రభారతి సమావేశ మందిరం
(మొదటి అంతస్థు), హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ కె.వి. రమణ, ఐ.ఎ.ఎస్. (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాప్రారంభం : శ్రీ మామిడి హరికృష్ణ సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ
అధ్యక్షులు : డా॥ ముక్తేవి భారతి, ప్రముఖ రచయిత్రి
విశిష్ట అతిథి : డా॥ పోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీ వేత్త
గౌరవ అతిథి : శ్రీ జి. వల్లీశ్వర్, ప్రముఖ రచయిత, పాత్రికేయులు

సా॥ 6 నుండి 6-45 వరకు
ప్రముఖ గాయని శ్రీమతి ఎస్.పి. పద్మశ్రీ గారిచే అన్నమయ్య సంకీర్తన సుమమాల

శ్రీభాష్యం యదు మోహన్ ప్రధాన కార్యదర్శి
చిరివేరు రఘురామ్ ఉపాధ్యక్షులు
జి. సత్యనారాయణ వ్యవస్థాపక అధ్యక్షులు

పండుగలా పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరపాలి

హైదరాబాద్, ఏప్రిల్ 22:టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు పండుగలా నిర్వహించాలని మంత్రి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఘట్‌కేసర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు, ఘట్‌కేసర్ మండల పరిధిలోని గ్రామా ల టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్ రోడ్డుపై పార్టీ జెండాలు, భారీ కటౌట్స్, స్వాగత తోరణాలను ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 21 ఏండ్లు పూర్తి చేస్తుకున్న సందర్భంగా ఈనెల 27న నిర్వహిస్తున్న పార్టీ ఆవిర్భావ వేడుకలను వైభవంగా చేపట్టాలన్నారు.మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా, మండలాల్లో గ్రామాల వారీగా పార్టీ జెండాను ఎగురవేయాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు సంఘటితంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు చామకూర భద్రారెడ్డి, చైర్మన్‌లు ఎం.పావనీ జంగయ్య యాదవ్, బి.కొండల్‌రెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షులు ఎం.సురేందర్ రెడ్డి, బి.శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ ముదిరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

-వరంగల్ రహదారిపై స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలి
-ప్రతి గల్లీలో గులాబీ జెండా రెపరెపలాడాలి

హైదరాబాద్, ఏప్రిల్ 22:పార్టీ ప్లీనరీ సమావేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించుకోవాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం బోడుప్పల్ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మేయర్ సామల బుచ్చిరెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ, సన్నాహక ఏర్పాట్లపై స్థానిక నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి గల్లీలో గులాబీ జెండా రెపరెపలాడాలని, అందుకు ప్రతి డివిజన్, ప్రతి కూడలిలో టీఆర్ఎస్ దిమ్మెల నిర్మాణం చేపట్టి, జెండాను ఆవిష్కరించాలని కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలకు సూచించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్వీట్లు పంచి, టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకోవడంతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలుకు వచ్చిన సీఎం జగన్‌కు ఘన స్వాగతం

అమరావతి, ఏప్రిల్ 22:వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ మూడో విడత పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఒంగోలులో ఘన స్వాగతం లభించింది. పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి శుక్రవారం హాజరయ్యారు. స్థానిక ఏబీఎం పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు ఉదయం 10:52 గంటలకే హెలికావ్టర్ లో సీఎం చేరుకున్నారు. ఉ 10:55 గంటలకు హెలికాప్టర్ నుంచి సీఎం కిందకు దిగారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఏ.యస్.దినేష్ కుమార్ పుష్పగుచ్ఛంతో ఘనంగా ఆహ్వానం పలికారు. జిల్లా ఇంఛార్జి మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పీ.ఆర్.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, డిఐజి త్రివిక్రమ్ వర్మ, జిల్లా ఎస్పీ మలికాగర్గ్, జేసీ ఎం.అభిషిక్త్ కిషోర్, జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకయమ్మ, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, పోతుల సునీత, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డిలు మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఏబీఎం ఉన్నత పాఠశాల హెలిప్యాడ్ వద్ద ఉదయం 11:23 గంటల వరకు విఐపీలతో పరిచయ కార్యక్రమం సాగింది. వీఐపీ గ్యాలరీలో కనిగిరి, దర్శి, గిద్దలూరు, మార్కాపురం, సంతనూతలపాడు, చీరాల శాసన సభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా వెంకట రాంబాబు, కుందుర్రు నాగార్జునరెడ్డి, టి.జె.ఆర్. సుధాకర్ బాబు, కరణం బలరాం కృష్ణమూర్తి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ మంత్రులు సిద్దా రాఘవరావు, గాదె వెంకటరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె కనకారావు, పి డి సి సి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మాజీ శాసనసభ్యులు జంకె వెంకట్ రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, బాచిన చెంచు గరటయ్య, మద్య విమోచన ప్రచార కమిటీ రాష్ట్ర ఛైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డిలు పుష్పగుచ్చాలు అందజేశారు.

తదుపరి మధ్యాహ్నం 01:52 గంటలకి హెలిప్యాడ్ కి చేరుకున్న ముఖ్యమంత్రి మధ్యాహ్నం 01:54 గంటలకు హెలికాప్టర్ ఎక్కగా, మధ్యాహ్న 01:59 గంటలకు ఒంగోలు నుంచి హెలికాప్టర్ బయలుదేరింది.

గుడ్ మార్నింగ్ ఆమదాలవలస.. స్పీకర్ తమ్మినేని

అమరావతి, ఏప్రిల్ 22:గుడ్ మార్నింగ్ ఆమదాలవలస అంటూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఇదొక వినూత్నమైన కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. గుడ్ మార్నింగ్ ఆమదాలవలస కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లక్ష్మిడిపేట వార్డులో ఇంటింట పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో లక్ష్మడుపేట నుండి వెంకంపేట వెళ్లే లింక్ రోడ్డు, కాలువలు నిర్మించాలని ప్రజలు స్పీకర్ ను కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ ఆమదాలవలస కార్యక్రమంలో తిరిగినప్పుడు ఎక్కువగా డ్రైనేజీ, త్రాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలే తన దృష్టికి వచ్చాయని అన్నారు. అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అదే విధంగా కొంతమంది మున్సిపల్ కుళాయి నీటిని చౌర్యం చేస్తున్నారని, మోటర్ల ద్వారా ట్యాంకులకు నింపుతున్నారని తెలిపారు. దీంతో ఎగువ ప్రాంతాల్లో ఉన్న వారికి మంచి నీరు రాక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు చేసి మోటార్ లను తొలగించాలని అధికారులకు స్పీకర్ ఆదేశించారు. ఈ విధంగా తిరగడం వలన ప్రజల సమస్యలు తెలుస్తాయని దాని ద్వారా జవాబుదారితనం పెరుగుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం చెప్పారు.

చట్ట ప్రకారమే ముందుకెళ్లాను : ఏబీ వెంకటేశ్వరరావు

అమరావతి, ఏప్రిల్ 22:సీనియర్ ఐపీఎస్ అధికారి, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ రద్దు చేస్తూ.. సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. మళ్లీ సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై.. ఏబీ వెంకటేశ్వరరావు స్పందించారు. తానెప్పుడు చట్టప్రకారమే ముందుకెళ్లానని పేర్కొన్నారు. కేసును తప్పుదారి పట్టించిన వారి నుంచి రెవెన్యూ రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. తాను ఎప్పుడూ చట్ట ప్రకారమే ముందుకెళ్లా నన్నారు. ఎవరి కళ్లలో ఆనందం కోసం ఇదంతా చేశారు నన్ను, నా కుటుంబాన్ని క్షోభ పెట్టి ఏం సాధించారు సస్పెన్షన్‌ను ప్రశ్నించడమే నేను చేసిన తప్పా నాపై వాదించే లాయర్లకు రూ.లక్షల ఫీజు చెల్లించారు. అసలు కొనుగోలే లేనప్పుడు అవినీతి ఎలా జరుగుతుంది కొందరు తప్పుడు కేసులతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చారన్నారు. తప్పుదారి పట్టించిన వారినుంచి రెవెన్యూ రికవరీ చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టేది లేదని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం : మంత్రి మల్లారెడ్డి

రంగారెడ్డి, ఏప్రిల్ 19:రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి దత్తత మండలమైన మూడు చింతలపల్లి మండలం పర్యటనలో భాగంగా లక్ష్మాపూర్ గ్రామ రైతులకు 176 పాస్ పుస్తకాలను ఈరోజు మంత్రి మల్లారెడ్డి రైతులకు అందజేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా లక్ష్మాపూర్ గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు గ్రామ సర్వే నిర్వహించి రైతులకు పట్టాదారు పాసు బుక్కులు అందజేస్తారని తెలిపారు.

ఇప్పటికే మొదటి విడత కింద మూడు వందల మందికి పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వగా ఈ రోజు మరో 176 మందికి పాస్ పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత తెలంగాణ రాష్టానికి దక్కుతుందని మల్లారెడ్డి పేర్కొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : అదనపు ఎస్పీ

వరంగల్, ఏప్రిల్ 22: నిరుద్యోగ యువత ఇష్టపడి చదివితే గమ్యాన్ని ఖచ్చితంగా చేరవచ్చని, శ్రమిస్తేనే ఫలితం ఉంటుందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్, పోలీస్ శాఖ సహకారంతో నిరుద్యోగ యువతకు పోలీస్ రిక్రూట్ మెంట్ కు సంబంధించిన ఫ్రీ కోచింగ్ సెలెక్షన్, (స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్ లో ఎంపికైన అభ్యర్థులకు 2 నెలల పాటు ఉచిత వసతి, దేహదారుఢ్య సామర్థ్య శిక్షణతో పాటు వివిధ సబ్జెక్టులకు క్లాసులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ వి.శ్రీనివాసులు మాట్లాడుతూ? నిరుద్యోగ యువత పోలీసులతో పాటు, అన్నీ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఉద్యోగ అవకాశనీ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ డెవలప్ మెంట్ ఆధికారిణి సునీత, భూపాలపల్లి సీఐ రాజిరెడ్డి, రిజర్వ్ ఇన్ స్పెక్టర్ సంతోష్ కుమార్, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు యాదిరెడ్డి, మధుకర్, శ్రావణ్, చరణ్, వీరన్న పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

హైదరాబాద్, ఏప్రిల్ 22: అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడలోని శ్రీలక్ష్మి పొదుపు సంఘంలో గురువారం రాజేంద్రనగర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో మెగా ఆరోగ్య మేళా ప్రారంభించారు. ఇందులో ఆయా స్పెషలిస్టుల ద్వారా పలు రకాల హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత జీవన విధానంలో తరచూ మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులు అధికంగా వస్తున్నాయని వాటి భారీ నుంచి తప్పించుకోవడానికి వైద్య పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం వైద్య, విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. వైద్యశిబిరాలు పేద లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక వైద్యులతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బాల్‌రామ్ ,డీపీఎంవో రవీందర్‌రెడ్డి, డాక్టర్ స్వాతి, డాక్టర్ దివ్య, డాక్టర్ వందన, డాక్టర్ నిరోష, ఎస్ఈవో శ్రీనివాస్,సీహెచ్‌వో ఎండీ సిరాజ్‌ఉద్దీన్, హెచ్ఈవో చెన్నకేశవులు, సూపర్ వైజర్ శివకుమార్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌కు నిరసన సెగ

అమరావతి, ఏప్రిల్ 22: విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో సామూహిక లైంగిక దాడికి గురైన యువతిని పరామర్శించేం దుకు వచ్చిన ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు నిరసనలు ఎదురయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించేందుకు చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ప్రభుత్వ ఆసుపత్రికి తరలి వచ్చారు. అప్పటికే వివిధ మహిళా సంఘాలు, టీడీపీకి చెందిన మహిళలు ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన తెలుపుతుండగా అక్కడికి వచ్చిన చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఆమె లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు.

చివరకు పోలీసు బలగాలతో ఆమె బాధితురాలి వద్దకు వెళ్లి పరామర్శించారు. విజయవాడ పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా బాధితురాలిని పరామర్శించేందుకు రాగా ఆందోళనకారుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని మహిళలు మండిపడ్డారు.

వరంగల్‌లో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్ట్..

వరంగల్, ఏప్రిల్ 22:వరంగల్‌లో ఐ పి ఎల్ క్రికెట్ బెట్టింగ్ కొనసాగుతూనే ఉంది. తాజాగా వరంగల్ టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ ఆర్.సంతోష్ నేతృత్వంలో ఐ పి ఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల ఇంటిపై దాడి చేసి నలుగురు బెట్టింగ్ ఆర్గనైజర్లను అరెస్ట్ చేశారు. వారి నుండి 4 స్మార్ట్ ఫోన్లు సీజ్ చేశారు. అలాగే 2 లక్షల 60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఫోన్ పే, గూగుల్ పే ల ద్వారా క్రికెట్ బెట్టింగ్స్ కాస్తున్నట్టు టాస్క్ ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది.

ఈ మేరకు గీసుకొండ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఇంటిపై శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో గీసుకొండ ఒకటవ వార్డుకు చెందిన పకంటి పవన్ (24), పకంటి నిశాంతి (26), యాదగిరి గిరిధర్ (24), వీరగొని వంశీకృష్ణ (38) ను అరెస్ట్ చేశారు. తదుపరి చర్యల కోసం గీసుకొండ పోలీసులకు అప్పగించారు.

అనూషపై దాడి విచారకరం.. నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం : మంత్రి సత్యవతి

హనుమకొండ, ఏప్రిల్ 22:: హనుమకొండ అశోక్ నగర్‌లో ఎంసీఏ చదువుతున్న అనూష అనే యువతిని ప్రేమ పేరుతో వెంట పడుతూ..ఓ కిరాతకుడు గొంతు కోసిన సంఘటనపై స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అనూష ఆరోగ్య పరిస్థితిపై ఎంజీఎం వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అనూషకు మంచి వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. అనూషపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

వసతుల కల్పనకే మన ఊరు - మన బడి : పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్ , ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు - మన బడి పథకం ద్వారా వసతులు కల్పిస్తున్నామని పెద్దపెల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఓదెల మండలంలోని గుండ్లపల్లి లో రూ.4,16,000 ల నిధులతో చేపట్టనున్న పాఠశాల పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ? ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటుకు ధీటుగా తయారు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మన ఊరు - మన బడి పథకాన్ని ప్రారంభించారన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకాదేవి, జడ్పీటీసీ గంట రాములు, మండల పార్టీ అధ్యక్షుడు ఐరెడ్డి వెంకట్ రెడ్డి, ఛైర్మెన్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, రైతు బంధు మండలాధ్యక్షుడు కావేటి రాజు, వైస్ ఛైర్మెన్ మద్దెల కమల-నర్సయ్య, జిల్లా డైరెక్టర్ కందుల సదాశివ, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి, ఆకుల మహేందర్, సతీష్, యూత్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ పులుగు తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన-మొండయ్య, ఉప సర్పంచ్ వేల్పుల శ్రీనివాస్, డైరెక్టర్ లు కొట్టే దేవేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు కొట్టే మహేందర్, గ్రామ పాలక వర్గం, తెరాస ప్రజా ప్రతినిధులు, నాయకులు నారాయణ రెడ్డి, వేల్పుల సదయ్య, కేశవ రెడ్డి, బుచ్చి రాజిరెడ్డి, హన్మంత రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాస్క్ లేకుంటే 500 రూపాయల ఫైన్.. తమిళనాడు సర్కార్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:కరోనా కేసులు కాస్త పెరుగుతున్న నేపథ్యంలో స్టాలిన్ నేతృత్వంలోని తమిళనాడు సర్కార్ అలర్ట్ అయ్యింది. కరోనాను నియంత్రించడానికి బహిరంగ ప్రదేశాల్లో మాస్క్‌ను తప్పనిసరి చేసింది.

బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మాస్క్‌ను ధరించని పక్షంలో 500 రూపాయల జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాధాకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో ఎవరైతే మాస్క్ లేకుండా తిరుగుతుంటారో వారికి 500 రూపాయల జరిమానా విధిస్తాం.

వీటికి సంబంధించిన ఉత్తర్వులను కింది స్థాయి అధికారులకు కూడా చేరవేశాం అని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పేర్కొన్నారు. కరోనా తగ్గుముఖం పట్టిందన్న తప్పుడు భావనలో ప్రజలు ఉండిపోయారని, బహిరంగ ప్రదేశాల్లో ఏమాత్రం మాస్కులు ధరించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణాలు, రద్దీ ప్రాంతాల్లో కూడా మాస్క్ ధరించడం లేదన్నారు.

చెప్పింది చాలు నోరు ముయ్యి.. చనిపోయిన బాలుడి తల్లిపై అధికారిణి అరుపులు

లక్నో, ఏప్రిల్ 22:: 'చెప్పింది చాలు నోరు ముయ్యి?' అంటూ చనిపోయిన బాలుడి తల్లిపై ప్రభుత్వ అధికారిణి విరుచుకుపడింది. అంతా విస్తు పోయే ఈ ఘటన ఢిల్లీ సమీపంలోని ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్ జిల్లాలో జరిగింది. మోదీనగర్‌కు చెందిన నాలుగో తరగతి విద్యార్థి అనురాగ్ భరద్వాజ్, బుధవారం ఉదయం స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్తుండగా వాంతులయ్యాయి. దీంతో బస్సు కిటికీ నుంచి వాంతి చేసుకున్నాడు. బస్సు డ్రైవర్ దీనిని గమనించలేదు. ఈ నేపథ్యంలో ఒక స్తంభానికి విద్యార్థి తల ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించి స్కూల్ బస్సు డ్రైవర్, మరో బస్సు సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే స్కూల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

కాగా, మరణించిన విద్యార్థి అనురాగ్ తల్లిదండ్రులు గురువారం కొంతమంది పేరెంట్స్, స్థానికులతో కలిసి ఆ స్కూల్ ఎదుట నిరసన తెలిపారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంపై నినాదాలు చేశారు. ఈ విషయం తెలిసిన మోదీనగర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ శుభాంగి శుక్లా అక్కడకు వచ్చారు. కుమారుడి మృతిపై బాధను వ్యక్తం చేస్తున్న తల్లిపై ఆమె మండిపడ్డారు. 'చెప్పింది చాలు నోరు ముయ్యి' అని వేలు చూపించి ఆమెపై అరిచారు. 'నువ్వు ఎందుకు అర్థం చేసుకోవడం లేదు' అని ప్రశ్నించారు. అయితే చనిపోయింది నీ కుమారుడు కాదుగా అని అనురాగ్ తల్లి నేహా ఏడుస్తూ అన్నది. 'నా కుమారుడు మరణించడాన్ని నేను చాలా అర్థం చేసుకున్నా' అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

మరోవైపు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి ఈ విషయం వెళ్లింది. దీంతో బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈ ఘటనపై నివేదిక కోరారు. ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని తెలియడంతో అన్ని స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.



ప్రజా పాలనలో శ్రేష్ఠత్వానికిగాను ప్రధాన మంత్రి తరఫున ఇచ్చే పురస్కారాలను సివిల్ సర్వీసెస్ డే నాడు ప్రదానం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22:సివిల్ సర్వీసెస్ డే ను పురస్కరించుకొని ఈ రోజు న న్యూ ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన ఒక కార్యక్రమం లో ప్రజా పాలన లో శ్రేష్ఠత్వాని కి గాను ఇచ్చేటటువంటి ప్రధాన మంత్రి తరఫు పురస్కారాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో పాలుపంచుకొన్న వారి లో కేంద్ర మంత్రి శ్రీ జితేంద్ర సింహ్, ప్రధాన మంత్రి కి ప్రిన్సిపల్ సెక్రట్రి శ్రీ పి.కె. మిశ్రా, కేబినెట్ సెక్రట్రి శ్రీ రాజీవ్ గాబా తదితరులు ఉన్నారు.

ఈ కార్యక్రమం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, 'కర్మ యోగులు' అందరికీ సివిల్ సర్వీస్ డే శుభాకాంక్షలు పలికారు. పాలన ను మెరుగు పరచడం కోసం, మరి అలాగే జ్ఞానాన్ని వెల్లడి చేయడం కోసం ఒక సూచన ను చేస్తూ ఆయన తన ఉపన్యాసాన్ని మొదలు పెట్టారు. అవార్డు విజేత ల అనుభవాల ను ప్రతి వారం లో ఒకసారి వర్చువల్ మాధ్యమం ద్వారా శేర్ చేసే ప్రక్రియ ను అన్ని శిక్షణ అకాడమీ లు ఆరంభించాలి అంటూ ఆయన సలహా ను ఇచ్చారు. రెండోది, అవార్డుల ను గెలుచుకున్న ప్రాజెక్టుల లో నుంచి ఒక పథకాన్ని కొన్ని జిల్లాల లో అమలు చేయడం కోసం ఎంపిక చేసుకోవచ్చు, ఆ పని ని చేయడం ద్వారా గడించిన అనుభవాన్ని రాబోయే సంవత్సరం లో సివిల్ సర్వీస్ డే నాడు చర్చించవచ్చు అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి ఒక 20-22 సంవత్సరాల నుంచి మొదట ముఖ్యమంత్రి గా, ఆ తరువాత ప్రధాన మంత్రి గా తాను ప్రభుత్వ ఉద్యోగుల తో సంభాషిస్తూ వస్తున్న సంగతి ని గుర్తు కు తెచ్చారు. అది తమ రెండు పక్షాల కు ఒకరి నుంచి మరొకరు నేర్చుకొనేందుకు అవకాశాన్ని ఇచ్చింది అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం లో జరుపుకొంటున్న కార్యక్రమం 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సంవత్సరం లో జరుగుతోందంటూ శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖం గా ప్రస్తావించారు. ఇదివరకటి జిల్లా పాలకుల ను ఈ ప్రత్యేక సంవత్సరం లో జిల్లా కు ఆహ్వానించాలని ప్రస్తుత పరిపాలకుల కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇది జిల్లా లో కొత్త శక్తి ని నింపుతుంది, గత కాలం లో సంపాదించిన అనుభవం అనేది జిల్లా పాలన దృష్ట్యా ఆహ్వానించదగినటువంటి చైతన్యాన్ని అందిస్తుంది అని ఆయన అన్నారు. అదే విధం గా రాష్ట్రాల యొక్క ముఖ్యమంత్రులు ఈ ప్రతిష్ఠాత్మక సంవత్సరం లో స్వాతంత్ర్య భారతదేశం ప్రస్థానం లో గణనీయం గా తోడ్పాటు ను అందించిన పాలక యంత్రాంగం ప్రముఖుల నుంచి ప్రయోజనాన్ని పొందేందుకు గాను రాష్ట్రానికి చెందినటువంటి పూర్వ చీఫ్ సెక్రట్రీల ను, కేబినెట్ సెక్రట్రీల ను రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆహ్వానించవచ్చును అని ఆయన పేర్కొన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' జరుపుకొంటున్న సంవత్సరం లో సివిల్ సర్వీసు ను గౌరవించుకొనేందుకు ఇది ఒక సముచితమైన మార్గం కాగలదు అని ఆయన అన్నారు.

'అమృత్ కాలం' అంటే అది ఓ ఉత్సవాన్ని మాత్రమే జరుపుకోవడమో లేక గతాన్ని ప్రశంసించడమో కాదని, 75వ సంవత్సరం నుంచి 100వ సంవత్సరాని కి ప్రయాణించడం అనేది ఒక వాడుక గా మిగిలిపోకూడదు అని ప్రధాన మంత్రి అన్నారు. "ఎనిటతిజీ ఏ100 ఒక నియమిత చర్య కారాదు. ఈ 25 ఏళ్ళ కాలాన్ని ఒక యూనిటు గా భావించి, మరి మనం ఇక్కడి నుంచే ఒక దృష్టి కోణాన్నంటూ ఏర్పరచుకోవాలి. ఈ ఉత్సవం ఒక చెప్పకోదగిన ఘట్టం అవ్వాలి. ప్రతి ఒక్క జిల్లా ఇదే విధమైన ఉత్సాహం తో ముందుకు సాగాలి. ప్రయాసల లో ఎటువంటి వెనుకబాటుతనం ఉండరాదు. ఇది 1947వ సంవత్సరం లో ఇదే రోజు న, సర్ దార్ పటేల్ గారు చూపిన దారులకు మరియు చేసిన ప్రతిజ్ఞ లకు మనల ను మనం పునరంకితం చేసుకోవలసిన అటువంటి కాలం అని ప్రధాన మంత్రి అన్నారు.

మన ప్రజాస్వామ్య వ్యవస్థ లో మూడు లక్ష్యాల కు మనం కంకణం బద్ధులం కావలసి ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఒకటో లక్ష్యం ఏమిటి అంటే అది దేశం లోని సామాన్య ప్రజల జీవనం లో ఒక మార్పు కావాలి, వారి జీవనం సులభతరం కావాలి, మరి ఈ సుగమత తాలూకు అనుభవాన్ని వారు సైతం గ్రహించ గలగాలి అనేదే. ప్రభుత్వం తో వారి యొక్క కార్యకలాపాల ను జరుపుకోవడం లో సామాన్య ప్రజానీకం సంఘర్షణ కు లోనవకూడదు. ప్రయోజనాలు మరియు సేవలు అనేవి ఎటువంటి ఇబ్బంది లేకుండానే అందాలి అని ఆయన వివరించారు. ''సామాన్య మానవుడి స్వప్నాల ను అవి నెరవేరే స్థాయి కి చేర్చడం అనేది వ్యవస్థ యొక్క బాధ్యత. ఈ సంకల్పాన్ని సిద్ధి దశ కు తీసుకు పోవాలి. మరి అదే మన అందరి గమ్యం కావాలి. కలగనడం మొదలుకొని సంకల్పాన్ని తీసుకోవడం నుంచి సిద్ధి దశ కు సాగిపోయేటటువంటి ఈ యొక్క యాత్ర లో ప్రతి మజిలీ లోను వారి చేతుల ను పట్టుకుని నడిపించడాని కి మనం వారి పక్కనే నిలబడాలి" అని ఆయన అన్నారు. రెండో విషయం ఏమిటి అంటే భారతదేశం యొక్క మారుతున్న ముఖచిత్రాన్ని మరియు పెరుగుతున్న స్థాయి ని గమనిస్తే మనం చేసేది ఏది అయినప్పటికీ ఆ కార్యం ప్రపంచ స్థాయి లో జరగాలి అనేదే. ప్రపంచం స్థాయి లో చోటు చేసుకొంటున్న కార్యకలాపాల ను మనం అనుసరించ లేకపోయామంటే గనక మన ప్రాథమ్యాలు, మనం శ్రద్ధ వహించవలసిన రంగం ఏవి అనేది నిర్ధారించుకోవడానికి చాలా కష్టం అయిపోతుంది. ఈ విషయాన్ని మనస్సు లో పెట్టుకొని మనం మన పథకాల ను, మన పాలన నమూనాల ను అభివృద్ధి పరచుకోవలసిన అవసరం ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. మన వ్యవస్థ లు మరియు నమూనా లు నియమిత వేగం తో మార్పు చేర్పుల కు అనువు గా ఉండాలి. గత శతాబ్ది తాలూకు వ్యవస్థల తో నేటి కాలం లోని సవాళ్ళ ను మనం ఎదుర్కోలేం అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఇక మూడో విషయం గా "వ్యవస్థ లో మనం ఎక్కడ ఉన్నప్పటి కీ కూడా దేశం యొక్క ఏకత మరియు అఖండత అనేవి మన ప్రధానమైనటువంటి బాధ్యత గా ఉండాలి. దీనిలో ఎటువంటి రాజీ కి తావు ఉండనేకూడదు. స్థానికం గా తీసుకొనే నిర్ణయాలు అయినా సరే వాటిని ఇదే గీటురాయి పైన గీచి గమనించుకోవాలి. మనం తీసుకొనే ప్రతి ఒక్క నిర్ణయం దేశం యొక్క ఐకమత్యాని కి, దేశం యొక్క సమగ్రత కు బలాన్ని ఇవ్వగలిగింది గా ఉండాలి. 'దేశ ప్రజల కు అగ్ర తాంబూలం' (నేశన్ ఫస్ట్) అనేది మన నిర్ణయాల కు సదా మూలం గా ఉండాలి అని ఆయన అన్నారు.

భారతదేశం యొక్క ఘనమైన సంస్కృతి అనేది రాచరిక వ్యవస్థ లు మరియు రాచరిక సింహాసనాలు వంటి వాటితో తయారు కాలేదు. వేల కొద్దీ సంవత్సరాల పాటు మనం అనుసరిస్తూ వస్తున్న సంప్రదాయం ఏది అంటే అది సామాన్య మానవుని యొక్క బలాన్ని వెంట తీసుకొని ముందుకు పోవడం అనేదే. ఇది దేశాని కి ఉన్నటువంటి మార్పు ను స్వీకరించే భావన ను మరియు మన ప్రాచీన జ్ఞానాన్ని కాపాడుకొంటూనే ఆధునికత ను అక్కున చేర్చుకోవడాన్ని సూచిస్తున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. సమాజం యొక్క సామర్థ్యాన్ని పెంచి పోషించడం, సమాజం యొక్క శక్తి ని వెలికి తీయడం, మరి అలాగే సమాజం యొక్క సామర్థ్యాన్ని సమర్ధించడం.. ఇవే ప్రభుత్వ వ్యవస్థ యొక్క కర్తవ్యాలు అని ఆయన ప్రముఖం గా పేర్కొన్నారు. స్టార్ట్-అప్ ఇకో సిస్టమ్ లోను, వ్యవసాయం లోను తెర మీద కు వస్తున్నటువంటి నూతన ఆవిష్కరణల తాలూకు ఉదాహరణల ను గురించి ఆయన ప్రస్తావిస్తూ, రూపశిల్పుల పాత్ర ను మరియు సమర్థకుల భూమిక ను పోషించండి అంటూ పరిపాలకుల కు ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఒక టైపిస్టు కు మరియు ఒక సితార్ వాదకుని కి మధ్య ఉన్న తేడా ను గురించి ప్రధాన మంత్రి నొక్కి చెప్తూ, పరిశీలించగల జీవనాన్ని గడపవలసిన అవసరం, కలల ను కంటూ ఉత్సాహం తొణికిసలాడుతూ ప్రయోజనం తో కూడిన జీవనాన్ని సాగించవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. "నేను ప్రతి ఒక్క క్షణం లో జీవించాలి అని కోరుకొంటున్నాను.

ఎందుకంటే, అలా చేయడం ద్వారా ఇతరులు సైతం చక్కగా జీవించడాని కి వారికి నేను సేవ చేస్తాను, వారికి నేను సాయం చేస్తాను" అని ఆయన అన్నారు. పలువురు నడచిన దారినే మనమూ నడవడం కాకుండా నిర్ణీత పరిధి కి మించిన ఆలోచనల ను చేయాలి అంటూ అధికారుల కు శ్రీ నరేంద్ర మోదీ ఉద్బోధించారు. పాలన లో సంస్కరణ మన సహజ వైఖరి కావాలి అంటూ ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. పాలన పరమైన సంస్కరణ లు అనేవి ప్రయోగాత్మకం గా ఉండాలి. అంతేకాకుండా, అవి కాలం యొక్క మరియు దేశం యొక్క అవసరాల ను బట్టి ఉండాలి అని ఆయన చెప్పారు. పాతబడిపోయిన చట్టాల ను తగ్గించడం, పాటించవలసిన నియమాల సంఖ్య ను కుదించడం.. ఇవి తన అతి ముఖ్యమైన పనుల లో ఒక పని అయిందని ఆయన తెలిపారు. మనం ఒత్తిడి కి లోనైనప్పుడు మాత్రమే మార్పు నకు లోను అవకూడదు, మనం ఫలానా మార్పు జరుగుతుంది అనే సూచన అందడాని కంటే ముందుగానే మెరుగుదల కోసం ప్రయత్నించాలి అని ప్రధాన మంత్రి అన్నారు. కొరత బాధించిన కాలం లో చోటుచేసుకొన్న నిబంధనల వల్ల మరియు మనస్తత్వం వల్ల మనం పాలింపబడకూడదు. మనం సమృద్ధి తాలూకు ధోరణి ని కలిగివుండాలి. అదే మాదిరి గా మనం సవాళ్ళ కు ప్రతిస్పందించడం ఒక్కటే కాకుండా ఆ సవాళ్ళ ను ముందుగానే అంచనా కట్టాలి అని ఆయన అన్నారు. ''గడచిన 8 సంవత్సరాల కాలం లో దేశం లో ఎన్నో పెద్ద పెద్ద ఘటన లు జరిగాయి. ఈ ప్రచార ఉద్యమాల లో అనేకం ఎటువంటివి అంటే వాటి వల్ల నడవడిక పరమైనటువంటి మార్పు చోటు చేసుకొంది" అని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. నేను రాజ నీతి తాలూకు స్వభావం కలిగిన వాడి ని కాను, నేను జన నీతి యొక్క లక్షణం కలిగినవాడిని అని ఆయన అన్నారు.

అధికారులు వారి జీవనం లో కీలక సంస్కరణల ను అవలంబించాలి అని అభ్యర్థిస్తూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు. ఉదాహరణ గా చెప్పాలి అంటే, అది పరిశుభ్రత కావచ్చు, జిఇఎమ్ ను ఉపయోగించడం కావచ్చు లేదా వారి జీవనం లో యుపిఐ కి స్థానం ఉన్నదా లేక లేదా అనేది గమనించుకోవాలి అంటూ ఆయన ప్రస్తావించారు.

సామాన్య పౌరుల సంక్షేమం కోసం జిల్లా లు/కార్యాచరణ విభాగాలు మరియు కేంద్రీయ / రాష్ట్రాల సంస్థలు అమలు పరచినటువంటి అసాధారణమైన కార్యాల ను మరియు కొత్త కొత్త కార్యక్రమాల ను గుర్తించాలి అనే ఉద్దేశ్యం తో ప్రజా పాలన లో ప్రావీణ్యాని కి గాను ప్రధాన మంత్రి తరఫున ప్రకటించేటటువంటి పురస్కారాల ను ఏర్పాటు చేయడం జరిగింది. గుర్తించిన ప్రాథమ్య కార్యక్రమాలు మరియు నూతన ఆవిష్కరణల ను ప్రభావవంతమైన రీతి లో అమలు పరచినందుకు కూడా ఈ పురస్కారాల ను ప్రదానం చేయడం జరుగుతున్నది.

ఈ కింద ప్రస్తావించినటువంటి అయిదు గుర్తించిన ప్రాథమ్య కార్యక్రమాల లో చేసిన మార్గదర్శక ప్రాయమైన కార్యాల కు గాను సివిల్ సర్వీసెస్ డే 2022 సందర్భం లో పురస్కారాల ను ప్రదానం చేయడం జరుగుతున్నది: (1) పోషణ్ అభియాన్ లో "జన్ భాగీదారీ" లేదా ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, (2) ఖేలో ఇండియా పథకం యొక్క మాధ్యమం ద్వారా క్రీడలు మరియు వెల్ నెస్ లో శ్రేష్ఠత్వాన్ని ప్రోత్సహించడం, (3) పిఎమ్ స్వనిధి యోజన లో డిజిటల్ పేమెంట్స్ మరియు సుపరిపాలన, (4) ఒక జిల్లా, ఒక ఉత్పత్తి పథకం యొక్క మాధ్యమం ద్వారా సమగ్ర అభివృద్ధి, (5) మానవ ప్రమేయానికి తావు లేకుండానే సేవల ను ఆరంభం నుంచి అంతం వరకు నిరంతరాయంగా ప్రజల కు అందించడం.

ఈ సంవత్సరం లో గుర్తించిన అయిదు ప్రాథమ్య కార్యక్రమాలు మరియు ప్రజా పాలన/సేవ ల అందజేత మొదలైన రంగాల లో నూతన ఆవిష్కరణల కు గాను మొత్తం 16 పురస్కారాల ను ఇవ్వడం జరుగుతున్నది.

గర్జించిన టీఆర్ఎస్ మహిళా నేతలు

ఖమ్మం, ఏప్రిల్ 22:మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరిపై ఖమ్మం టీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు విరుచుకుపడ్డారు. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పైన, ఆయన సతీమణి వసంతలక్ష్మి పైన రేణుకా చౌదరి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మంత్రి పువ్వాడపై మాట్లాడే కనీస అర్హత రేణుకా చౌదరికి లేదని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్త సాయి గణేష్ ఆత్మహత్య సంఘటనలో మంత్రి పువ్వాడ ప్రమేయం ఏ మాత్రం లేకున్నప్పటికీ రేణుకాచౌదరి హైదరాబాదులో ఇద్దరు రౌడీలను వెంటేసుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చెన్నై రౌడీని విజయవాడ రౌడీని వెంటబెట్టుకుని మాట్లాడుతున్న రేణుకా చౌదరి ఖమ్మం జిల్లాలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు.

యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి గుడికి కిలో బంగారం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు అందజేస్తే.. పాప ప్రక్షాళన కోసం చేశారంటూ రేణుకాచౌదరి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. రేణుకా చౌదరి ఇదే రీతిలో మాట్లాడితే తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. మీ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ప్రస్తుతం ఖమ్మం నగరం, ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సారథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక రేణుకా చౌదరి కుట్రతో మంత్రిని బదనాం చేసే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఎప్పుడో ఒకసారి జిల్లాకు చుట్టపుచూపుగా వచ్చి పోతూ ఆడబిడ్డను మాయ బిడ్డను అంటూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్న రేణుకా చౌదరికి జిల్లాలో భవిష్యత్తులో అడుగుపెట్టే అవకాశం ఇవ్వమని హెచ్చరించారు. అనంతరం రేణుకా చౌదరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇల్లందు క్రాస్ రోడ్డు లో రేణుకా చౌదరి దిష్టిబొమ్మను మహిళా ప్రజాప్రతినిధులు దగ్ధం చేశారు. రేణుకాచౌదరి సూర్పణకగా, ముక్కు చెవులు కోస్తా మంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ పాతిమా జోహారా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ లక్ష్మీ ప్రసన్న, మహిళా అధ్యక్షురాలు కొల్లు పద్మ , బానోతు ప్రమీల, ఖమ్మం నగరంలోని మహిళా కార్పొరేటర్లు అంతా పాల్గొన్నారు.

భారత్ లోకి హాంకాంగ్ కన్ఫెక్షనరీ అగ్రగామి యు ఫుడ్స్

హైదరాబాద్, ఏప్రిల్ 22:హాంకాంగ్ కు చెందిన, రూ.25 కోట్ల టర్నోవర్ కలిగిన కన్ఫెక్షనరీ అగ్రగామి యు ఫుడ్స్ యోలీ యోలా బ్రాండ్ కింద దక్షిణ భారతీయ మార్కెట్లోకి నోరూరించే విస్తృత శ్రేణికి చెందిన ఎగ్జయిటింగ్, ఫ్లేవర్ తో కూడిన, వినూత్న కన్ఫెక్షనరీ ఉత్పాదనలను ప్రవేశపెట్టడం ద్వారా భారతదేశంలోకి ప్రవేశించింది. ఈసందర్భంగా యు ఫుడ్స్ ఇండియా ప్రై.లి. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అద్వైత్ ప్రధాన్ మాట్లాడుతూ?. యోలీ యోలా, ఫ్రుబాల్ బ్రాండ్ల కింద కంపెనీ విస్తృత శ్రేణిలో రుచికరమైన, వినూత్న కన్ఫెక్షనరీ ఉత్పాదనలను ప్రవేశపెట్టనుందన్నారు. సాఫ్ట్ క్యాండీలు, లాలీపాప్ లు, చాకొలెట్ బాల్స్, హ్యాపీ బీన్స్, కప్ జెల్లీస్ లాంటివి ఇందులో ఉంటాయన్నారు. మీ రుచిబొడిపెలకు ఆనందం కలిగించేలా యోలీ యోలా సాఫ్ట్ క్యాండీలు నాలుగు నూతన ఫ్లేవర్స్ తో సహా స్ట్రాబెర్రీ, లిచి, గవా, రా మ్యాంగో, కోలా లెమన్ మింట్, అల్ఫాన్సో మ్యాం గో, ఇమ్లీ వంటి రుచుల్లో రానున్నాయని, వీటి ధరలు రూ.1 మొదలుకొని రూ.300 దాకా ఉంటాయన్నారు. తమ ప్రాథమ్యాల జాబితాలో భారత్ ఎంతో పైస్థాయిలో ఉందన్నారు. నాణ్యత, వినూత్న కన్ఫెక్షనరీ ఉత్పాదనల విషయానికి వస్తే దేశం ఇంకా అండర్ సర్వ్ డ్ మార్కెట్ గానే ఉందని తమ అధ్యయనాలు సూచించాయన్నారు.

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం.. 134 కోట్లతో స్టాంవాటర్ డ్రైనేజీల నిర్మాణం

కరీంనగర్ , ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ సిటీలో ఇక మీదట వరద ముంపు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, 134 కోట్లతో స్టాం వాటర్ డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు మేయర్ సునీల్ రావు . కరీంనగర్ అభివృద్ధిలో భాగంగా శుక్రవారం నగరంలోని 50, 59, 60 డివిజన్లలో పర్యటించారు. మొదటగా 50వ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ ప్రాంతంలోని బైపాస్ రోడ్డు స్టాంవాటర్ డ్రెయినేజీ పనులను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు అంజయ్య, కాసర్ల ఆనంద్ తో కలిసి తనిఖీ చేశారు. అంబేద్కర్ స్టేడియం నుండి? కోతి రాంపూర్ ప్రధాన రహదారి వరకు పాదయాత్ర చేపట్టి? స్టాంవాటర్ డ్రెయినేజీ పనులను క్షున్నంగా పరిశీలించారు. అనంతరం 59, 60 డివిజన్ల పరిదిలో గల సంతోషిమాత టెంపుల్ ఏరియాలో నిర్మాణం చేస్తున్న స్టాంవాటర్ డ్రైనేజీ పనులను కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు గందె మాదవి మహేష్, వాల రమణ రావు, నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేసి? పరిస్థితిని పరిశీలించారు.

డ్రైనేజీ నిర్మాణం పనుల విషయంలో కాంట్రాక్టర్ తో పాటు ఇంజనీరింగ్ అధికారులను సలహాలు, సూచనలు చేసి.. ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న పంచముఖ హనుమాన్ దేవాలయంలో మేయర్ సునీల్ రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సమస్యలు పలు అభివృద్ధి విషయాల పై డివిజన్ ప్రజలతో చర్చించి.. వాటి పరిష్కారం పై ప్రజలకు హామీ ఇచ్చారు. "కొన్ని సంవత్సరాలుగా వర్షాలతో వరద ముంపునకు గురౌతున్న కాలనీలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభింస్తుంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని నగరపాలక సంస్థ ద్వారా 134 కోట్ల రూ. నిధులు కేటాయించి నగర వ్యాప్తంగా ముంపునకు గురౌతున్న అన్ని కాలనీలలో స్టాం వాటర్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతున్నాం. వేసవి కాలంలోగా పనులను పూర్తి చేయాలనే టార్గెట్ ప్రకారం టెండర్లు పిలిచి? ఇప్పటికే పనులను ప్రారంభించాం ఇందులో భాగంగానే నగరంలోని గణేష్ నగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ పనులు కొనసాగుతున్న తీరును తనిఖీ చేసి పరిశీలించాం" అన్నారు.

చల్లటి కబురు.. తెలంగాణలో నాలుగు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22:కొన్ని రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి ప్రతాపం, వేడి గాలులు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ గుడ్?న్యూస్? చెప్పింది. తెలంగాణ రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే చాన్స్? ఉందని తెలిపింది. కర్నాటక, తెలంగాణ మీదుగా ఉపరితల ద్రోణి ఆవరించి ఉందని, ఈ నెల 25 వరకు దాని ప్రభావం తెలంగాణపై ఉంటుందని వెల్లడించింది.

దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్? వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్‌లో నిన్న సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసిన విషయం తెలిసిందే. సిటీ వ్యాప్తంగా వాన కురిసింది. కాగా, ఇవ్వాల (శుక్రవారం) ఇప్పటికే నగరం మొత్తం మేఘావృతమై ఉన్నది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటాం : మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ , ఏప్రిల్ 22:: హనుమకొండలో ఎంసీఏ చదువుతున్న యువతిని ప్రేమ పేరుతో వెంట పడుతూ ఓ యువకుడు గొంతు కోసిన సంఘటనపై పంచాయతీరాజ్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలకు కారణమైన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. అలాగే యువతి ఆరోగ్య పరిస్థితిపై ఎంజీఎం వైద్యులు, సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. యువతికి మంచి వైద్యం అందించాలన్నారు.

రాజన్నను దర్శించుకున్న సెస్ చైర్మన్ గూడూరి ప్రవీణ్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి):: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శుక్రవారం వేములవాడ సెస్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ కుటుంబసమేతంగా దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు గూడూరి ప్రవీణ్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం చేయగా, అధికారులు రాజన్న ప్రసాదం అందజేశారు.

తదనంతరం నూతన సెస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన గూడూరి ప్రవీణ్ ను ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్ర శేఖర్ ,గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు గోలి శ్రీనివాస్,డి శేఖర్ గుండి నరసింహమూర్తి,ఎన్. రాజేందర్ లు శుభాకాంక్షలు తెలిపారు.ఆయన వెంట మున్సిపల్ చైర్పర్సన్ రామతీర్థపు మాధవి రాజు సెస్ డైరెక్టర్లు పొలాస నరేంద్ర ,ఆకుల దేవరాజం, కొ ఆప్షన్ సభ్యులు సర్వర్ బాబు న్ టీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి ఉన్నారు

రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డ చరిత్ర లేదు : ఎమ్మెల్యే సీతక్క

వరంగల్, ఏప్రిల్ 22: రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన యవుసం బాగు పడ్డ చరిత్ర లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ పల్లె పల్లెకు సీతక్క కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట, రామంజాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ?. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పేద ప్రజలకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. యాసంగి వరి వెయ్యద్దు.. వరి వేస్తే ఉరి అన్న ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్ హౌస్ లో 150 ఎకరాల్లో వరి వేసిండు అని తెలంగాణ రైతులకు ఒక న్యాయం కేసీఆర్ కు ఒక న్యాయమా? వరి వేయొద్దని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం మూలాన సాగు భూములు బీడు భూములుగా మారిన పరిస్థితి ఉందని సీతక్క అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలి.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సీతక్క అన్నారు. అనంతరం రామప్ప రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్ పోలీసులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ

కరీంనగర్ , ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): మండుటెండల్లో విధులను నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు కరీంనగర్ డయిరీ సహకారంతో అందిస్తున్న ×ఉచిత మజ్జిగ× పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు డయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావు తో కలిసి పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ప్రారంభించారు

కరీంనగర్ లోని ఆర్టీసి బస్టాండ్ ఇన్ గేట్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ కరీంనగర్ డయిరీ వారు అందిస్తున్న సహకారం అమూల్యమైనదన్నారు.అన్ని వర్గాలకు చెందిన ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవలందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని, ప్రజలు తమ వంతు సహకారం అందిస్తూ పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు

కళ్లద్దాలు పంపిణి

ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందటం తో పాటు దుమ్ము ధూళిల నుండి ట్రాఫిక్ పోలీసులకు రక్షణ కల్పించడం కోసం లైఫ్ లైన్ ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా అందజేసిన కళ్లద్దాలను శుక్రవారం నాడు పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ పంపిణీ చేశారు

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్లు జి తిరుమల్, నాగార్జున రావు, లైఫ్ ఆసుపత్రి యాజమాన్యం తరపున ప్రశాంత్, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు

ఇఫ్తార్ విందులు సోదర భావాన్ని పెంపొందిస్తాయి

-మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇఫ్తార్ విందు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి):రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో గురువారం సాయంత్రం పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఖురాన్ ను పూర్తి చేసిన ఆలీం పాషా, అఫ్రోజ్ లను వేములవాడ పట్టణంలో ముస్లిం కమిటీ తరపున పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డి ఎం డబ్ల్యూ ఓ సర్వర్ మియా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు తీతంగా సోదర భావాన్ని దైవ భీ తి ని పెంపొందించే మాసం పవిత్ర రంజాన్ మాసమని అన్నారు.పవిత్ర మాసంలో ప్రతి ముస్లిం నిష్టతో రోజులు ఉపవాసాలు ఉండటంతో పాటు పరమత సహనం పాటిస్తూ ఎదుటి వారిని ఆదరించే దావతే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించి ఇస్లాం ఔన్నత్యాన్ని వివరించడం,ఆకలితో ఉన్న వారిని చేరదీసి భోజనం పెట్టడం రంజాన్ మాసం ప్రత్యేకత అని వివరించారు.ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్ మాట్లాడుతూ వేములవాడ పట్టణం అన్ని సంస్కృతీ సంప్రదాయాల కలయిక అని గంగాజమున తెహజీబ్ శాంతియుతమైన వాతావరణానికి నిదర్శనమని అన్నారు .రంజాన్ పండుగ అనేది దేశానికి పరిమితం కాదు ప్రపంచ పండుగ అని చెప్పారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి , కార్యదర్శి వలి,ఉపాధ్యక్షులు సయ్యద్ , రసూల్, తుర్కాకాశనగర్ సర్పంచ్ షేక్ హుస్సేన్జర్నలిస్టు ఎం ఏ మన్నాన్ ,తాహెర్ పాషా సయ్యద్ పాష ,కలిం పాషా, నయీమ్ ఉద్దీన్ నవబ్ ఖాన్ టీఆర్ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ అంజాద్ పాషా , గౌస్ బాబా ముస్లిం మత పెద్దలు మహమ్మద్ అబు జానీ, ఆజార్ , అసద్ , జావేద్ ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామప్ప శిల్ప కళా సౌందర్యం అద్భుతం.. కేంద్ర ప్రభుత్వ అధికారి నితిన్ వర్మ

వెంకటాపూర్ ,ఏప్రిల్ 22:: రామప్ప ఆలయంలోని శిల్ప కళా సౌందర్యం అద్భుతంగా ఉందని.. ఇట్లాంటి కళా చాతుర్యం మరెక్కడా చూడలేదన్నారు కేంద్ర ప్రభుత్వ అధికారి నితిన్ వర్మ. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం టూరిజం గైడ్ విజయ్ శిల్పకళ సౌందర్యం గురించి వారికి వివరించారు. శిల్ప కళా సౌందర్యాన్ని చూసి వారు అబ్బుర పోయారు. ఆ తర్వాత రామప్ప సరస్సులో బోటింగ్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రా॥ఓ) స్టేట్ కోఆర్డినేటర్ లు శ్రావ్య, శ్యామ్ కుమార్, బాల చంద్ర, డిఆర్డిఓ వెంకటనారాయణ, అడిషనల్ డిఆర్డిఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెస్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌ను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ మాధవి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల సెస్ ఛైర్మెన్ గా ఎన్నికైన గూడూరి ప్రవీణ్ శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చాంబర్ లో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి-రాజులు సెస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన గూడూరి ప్రవీణ్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం రాజన్న చిత్రపటం, ప్రసాదం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సెస్ డైరెక్టర్ పొలాస నరేందర్, రూరల్ సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, టిఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షులు గోస్కుల రవి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బాబూన్, టిఆర్ఎస్ నాయకులు సెస్ ఏడీ ఏఈ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియేట్ పరీక్షలు సజావుగా, సాఫీగా నిర్వహించుటలో లైన్ డిపార్టుమెంట్ అధికారులు సహకరించాలి - ఇంటర్మీడియట్ విద్యాధికారి

మెదక్, ఏప్రిల్ 22 (నేటి నిజం ప్రతినిధి): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఇంటర్మీడియేట్ పరీక్షలు సజావుగా, సాఫీగా నిర్వహించుటలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు సహకరించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ కోరారు. మే 6 నుండి 21 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో 13,777 విద్యార్థుల హాజరు కానున్నారని ఇందుకోసం 31 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై లైన్ డిపార్ట్మెంట్స్ అయినా విద్య, వైద్య, రెవిన్యూ, పోలీసు, విద్యుత్, ఆర్.టి.సి. పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 6,619, ఒకేషనల్ విద్యార్థులు 640 కాగా, ద్వితీయ సంవత్సరపు జనరల్ విద్యార్థులు 6,032 మంది, ఒకేషనల్ విద్యార్థులు 486 పరీక్షలకు హాజరవుతున్నారని సత్యనారాయణ తెలిపారు. ఇట్టి పరీక్షలు సాఫీ గా నిర్వహించుటకు ఒక తహశీల్దార్, సబ్ ఇన్స్పెక్టర్, జూనియర్ లెక్చరర్ తో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, నలుగురు జూనియర్ లెక్చరర్ లతో సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను, 5 మంది సభ్యులతో కస్టడీయన్ లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 13 పోలీస్ స్టేషన్ లలో భద్రపరుస్తున్న ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించుటకు, సెక్యూరిటీ ఏర్పాటు చేయడంతో పాటు, 31 పరీక్షా కేంద్రాలకు అవసరమైన పోలిసు బందోబస్తు ఏర్పాటు చేయవలసినదిగా పోలిసు అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు, సమీప జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలని, సున్నిత, అతి సున్నిత కేంద్రాలను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా రెవిన్యూ అధికారులను కోరారు. పరీక్షలకు సాఫీగా నిర్వహించుటకు అవసరమైన సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా కేటాయించవలసినదిగా విద్యాశాఖాధికారి సూచించారు . వేసవి కాలం దృష్ట్యా ప్రతి కేంద్రము వద్ద ప్రాథమిక చికిత్స అందించుటకు అవసరమైన మందులు, ఓ.ఆర్ .ఎస్. ప్యాకెట్లతో ఏ.యెన్.ఎం. లను ఏర్పాటు చేయవలసినదిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని, విద్యుత్ లో అంతరాయం కలగకుండా చూడవలసినదిగా విద్యుత్ అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 8. 30 గంటల వరకు వచ్చే విధంగా బస్సులు నడపవలసినదిగా ఆర్.టి.సి. అధికారులను కోరారు. పోస్టల్ శాఖ వారు పరీక్షల సమయంలో వచ్చే పార్సిళ్లను మధ్యాన్నం మూడు గంటల వరకు తీసుకొని వెంటనే స్పీడ్ చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాలకు కేటాయించిన పోలిసు, వైద్య శాఖ సిబ్బంది మొబైల్ నెంబర్లు అందజేయవలసినదిగా ఆయన కోరారు. లైన్ డిపార్ట్మెంట్లు అధికారులకు అప్పగించిన పనిని బాధ్యతతో చేసి పరీక్షలు విజయ వంతంగా నిర్వహించుటలో సహకరించవలసినదిగా సత్యనారాయణ కోరారు. ఉదయం 9 నుండి మధ్యాన్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8.30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, మొబైల్స్ అనుమతి లేనందున ఎవరు వెంట తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డి.ఎస్.పి సైదులు, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ. మన్నన్, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్.. కారు, గొడ్డలి, కత్తి స్వాధీనం

మహబుబాబాద్, ఏప్రిల్ 22: వార్డు కౌన్సిలర్ బానోతు రవి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ హత్యను పక్కా పథకం ప్రకారమే చేశారని, రవిపై కక్షతో అతడిని ట్రాక్టర్‌తో గుద్ది, గొడ్డలి, కత్తితో నరికి చంపినట్టు తమ విచారణలో తెలిసిందని పోలీసులు ఇవ్వాల వెల్లడించారు. ఈ హత్యకు సంబంధించి ఎస్పీ శరత్? చంద్ర పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. "భుక్య విజయ్, భుక్య అరుణ్ సన్నిహితంగా ఉంటూ బానోతు రవి చేసే బిజినెస్ లలో సహకరించేవారు. అలా ప్రతి విషయంలో రవి వారిని వాడుకున్నదే తప్ప డబ్బులు ఇవ్వటం లేదనివారు కూడా సొంత వ్యాపారాలు మొదలు పెట్టుకున్నారు. అప్పటినుండి వారి మధ్య మనస్పర్ధలు పెరిగాయి. మాట్లాడుకోవటం మానేసారు. ఈ క్రమంలో వారికి చాలా విషయాల్లో రవి అడ్డుతగులుతున్నాడని భావించి హతమార్చేందుకు ప్లాన్ వేశారు..

రవి ఒంటరిగా ఊరు వెళ్తున్న విషయాన్ని గమనించి ట్రాక్టర్‌తో గుద్ది, కారులో తెచ్చుకున్న గొడ్డలి, కత్తితో నరికి చంపారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితులైన భూక్య విజయ్, భూక్య అరుణ్ లను అదుపులోకి తీసుకొని వారి నుండి నేరానికి ఉపయోగించిన రా॥ఏఈఉ ఆఇజిఏఖీఇ కారు, అరుణ్ ఉపయోగించిన కత్తి, వారి ఫోన్లు, రక్తపు మరకలు గల వారి బట్టలు స్వాధీనం చేసుకున్నారు. వారి వాంగ్మూలం ప్రకారం ఇతర నిందితులు అజ్మీర బాలరాజు, గుగులోతు చింటు , గుగులోతు భావుసింగ్, అజ్మీర కుమార్, కారపాటి సుమంత్ అదుపులోకి తీసుకున్నట్టు ఎస్?పీ శరత్? చంద్ర పవార్ తెలిపారు.

భారత్‌లోకి హాంకాంగ్ కన్ఫెక్షనరీ అగ్రగామి యు ఫుడ్స్

హైదరాబాద్, ఏప్రిల్ 22:హాంకాంగ్ కు చెందిన, రూ.25 కోట్ల టర్నోవర్ కలిగిన కన్ఫెక్షినరీ అగ్రగామి యు ఫుడ్స్ యోలీ యోలా బ్రాం డ్ కింద దక్షిణ భారతీయ మార్కెట్లోకి నోరూరించే విస్తృత శ్రేణికి చెందిన ఎగ్జయిటింగ్, ఫ్లేవర్ తో కూడిన, వినూత్న కన్ఫెక్షినరీ ఉత్పాదనలను ప్రవేశపెట్టడం ద్వారా భారతదేశంలోకి ప్రవేశించింది. వేగంగా దూసుకెళ్తు న్న కన్ఫెక్షినరీ మార్కెట్లోకి ప్రవేశించేందుకు, ఈ విభాగంలో భారీ వాటా పొందేందుకు కంపెనీ చేస్తున్న గట్టి ప్రయత్నాల నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. యు ఫుడ్స్ ఇండియా ప్రై.లి. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అద్వైత్ ప్రధాన్ నేడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. యోలీ యోలా, ఫ్రుబాల్ బ్రాండ్ల కింద కంపెనీ విస్తృత శ్రేణిలో రుచికరమైన, వినూత్న కన్ఫెక్షినరీ ఉత్పాదన లను ప్రవేశపెట్టనుంది. సాఫ్ట్ క్యాండీలు, లాలీపాప్ లు, చాకొలెట్ బాల్స్, హ్యాపీ బీన్స్, కప్ జెల్లీస్ లాంటివి ఇందులో ఉండనున్నాయి. మీ రుచిబొడిపెలకు ఆనందం కలిగించేలా యోలీ యోలా సాఫ్ట్ క్యాండీలు నా లుగు నూతన ఫ్లేవర్స్ తో సహా స్ట్రాబెర్రీ, లిచి, గవా, రా మ్యాంగో, కోలా లెమన్ మింట్, అల్ఫాన్సో మ్యా గో, ఇమ్లీ వంటి రుచుల్లో రానున్నాయి. వీటి ధరలు రూ.1 మొదలుకొని రూ.300 దాకా ఉంటాయి. తీపి రుచి కోసం ఎగ్జయిటింగ్, టేస్టీ యోలీ యోలా లాలీపాప్ శ్రేణిని రుచి చూడడం మరిచిపోవద్దు. ఇవి ఐదు ఎగ్జయిటింగ్ రుచుల్లో లభిస్తాయి. స్ట్రాబెర్రీ, లిచి, గవా, ఇమ్లీ, కోకోనట్ వీటిలో ఉన్నాయి. వీటి ధర రూ. 5 మొదలుకొని రూ.120 దాకా ఉంటుంది. వినియోగదారులకు యోలీ యోలా చాకొలెట్ బాల్స్ ఎంతో ఆనందాన్ని అందిస్తాయి. రుచిగా, క్రీమీగా, నో ట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఇవి ఉంటాయి. అథెంటిక్ కోకో రుచితో ఉంటాయి. ఒకటి తింటే చాలు... ఇం కా కావాలని అడుగుతారు. వీటి ధరలు రూ.10 మొదలుకొని రూ.75 దాకా ఉంటాయి. యోలీ యోలా హ్యాపీ బీన్స్ కూడా లభిస్తాయి. ఇవి క్యాండీలకు భిన్నంగా ఉంటాయి. స్ట్రాబెర్రీ, లిచి, గవా, బ్లూ బెర్రీ లాంటి పలు రుచుల్లో లభిస్తాయి. వీటి ధర రూ.10 నుంచి రూ.50 దాకా ఉంటుంది. ఇక ఒక వినూత్న ఉత్పాదన రంగురంగుల యోలీ యోలా ఫ్రుబాల్ కప్ జెల్లీలు. ఇవి కచ్చితంగా మీ మన స్సులను కొల్లగొడుతాయి. వీటిని డెజర్ట్ గా కూడా వినియోగించవచ్చు. ఎనిమిది విభిన్న రుచుల్లో ల భ్యం. వెల రూ.5 మొదలుకొని రూ.300 దాకా ఉంటుందని తెలిపారు. యోలీ యోలా బ్రాండ్ కింద చాకో బమ్, కోకో బమ్ కూడా ఉన్నాయి. ఇవి హార్డ్ బాయిల్డ్ క్యాండీస్ విభాగా నికి చెందినవి.ఈ ఆవిష్కరణల సందర్భంగా యు ఫుడ్స్ ఇండియా ప్రై.లి. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీ అద్వైత్ ప్రధాన్ మా ట్లాడుతూ, "మా ప్రాథమ్యాల జాబితాలో భారత్ ఎంతో పైస్థాయిలో ఉంది. నాణ్యత, వినూత్న కన్ఫెక్షినరీ ఉ త్పాదనల విషయానికి వస్తే దేశం ఇంకా అండర్ సర్వ్ డ్ మార్కెట్ గానే ఉందని మా విస్తృత అధ్యయనా లు సూచించాయి. నేడు వినియోగదారులు నిరంతరం ఉత్పాదనల్లో కొత్తదనం కోసం చూస్తున్నారు. యూ ఫుడ్స్ అనేది ముమ్మర ఉత్పాదన పోర్ట్ ఫోలియోతో ప్రపంచవ్యాప్తంగా బాగా ప్రజాదరణ పొందిన, చక్కగా నిలదొక్కుకున్న బ్రాండ్. కన్ఫెక్షినరీ విభాగంలో ఇది తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది అని అన్నారు.

ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్ , ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి): రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఎంబి గార్డెన్స్ లో ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ 30 రోజులపాటు ముస్లింలు కఠినమైన ఉపవాస దీక్ష చేపడతారని, ఉపవాస దీక్ష ముగిసే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసామన్నారు. రాబోయే రంజాన్ వినని ముస్లిలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

అగ్రగామిగా ఎదిగిన ఆదర్శ మాట్రిమోని

హైదరాబాద్, ఏప్రిల్ 22:విదేశీ వివాహ సంబంధాలు (ఎన్ఆర్ఐ)ను అత్యధికంగా కుదుర్చడంలో ఆదర్శ మ్యాట్రిమోని అగ్రగామిగా నిలిచిందని ఆ సంస్థల అధినేత వంగాల బాల్‌రాజ్ గౌడ్ తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసి 30ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గౌతు లచ్చన్న, టి. బాలాగౌడ్‌ల చేతుల మీదుగా ప్రారంభించిన ఆదర్శ మ్యాట్రిమోని అంచెలంచెలుగా ఎదుగుతోందన్నారు. గౌడ కులానికి మాత్రమే కాకుండా అన్ని కులాలవారికి ఇప్పటి వరకు 3500కుపైగా పెళ్ళిళ్లు కుదుర్చినట్లు ఆయన వెల్లడించారు. వివరాలకు 9989951626లో సంప్రదించాలన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్, జెర్సీలను అందజేస్తాం.. -రూరల్ సీఐ బన్సీలాల్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 22:(నేటినిజం ప్రతినిధి):కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్, జెర్సీలను అందజేస్తామని వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ అన్నారు. శుక్రవారం నూకలమర్రిలో పోలీస్ నేస్తం పేరిట ప్రజలకు చట్ట సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం యువజన సంఘాల ఆధ్వర్యంలో సీఐ బన్సీలాల్ జిల్లా అధ్యక్షులు సోమినేని బాలు ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా సోమినేని బాలు మే నెల నుండి గ్రామంలో క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్ ఆటల్లో శిక్షణ ఇస్తున్నందున, వారికి స్పోర్ట్స్ మేటిరియల్, జెర్సీలు అందించాల్సిందిగా సీఐ బన్సీలాల్ ను కోరారు.సానుకూలంగా స్పందించిన సీఐ బన్సీలాల్ క్రీడాకారులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సన్మానం కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ, రాములు, ఏఎంసి డైరెక్టర్ అంజనీకుమార్, ఉప సర్పంచ్ చంద్రయ్య, నాయకులు శ్రీనివాస్, శంకర్, తిరుపతి, మనోజ్, కె అంజనీకుమార్, జనార్దన్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్షల విషయంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలి - జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్

మెదక్, ఏప్రిల్, 22 (నేటి నిజం ప్రతినిధి): ఎలక్షన్లు, పరీక్షలు ఈ రెండు సునిశితమైన అంశాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా మూల్యం చెల్లించక తప్పదని, కాబట్టి అధికారులు మనసుపెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్ కోరారు. మే 23 నుండి జూన్ 1 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా కేంద్రం వారీగా నియమించిన చీఫ్ సూపరింటెండెంట్ లకు, డిపార్ట్మెంట్ అధికారులకు నిర్వహించిన ఒక రోజు పునశ్చరణ శిక్షణ తరగతులలో ఆయన పరీక్షల నిర్వహణ తీరుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 11,399 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, అందుకోసం 73 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఒక్కో కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంట్ అధికారిని నియమించాలని, వారు ఆయా కేంద్రాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షలు సజావుగా, సాఫీగా నిర్వహించేలా కృషి చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాలలో సీటింగ్ ఏర్పాట్లు, మంచి నీటి సౌకర్యం, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, ఏ.యెన్.ఎం. ల ఏర్పాటు వంటివి చూసుకోవాలని అన్నారు. పోలిసు స్టేషన్ నుండి ప్రశ్నా పత్రాలు వచ్చిన తరువాత విద్యార్థులకు పంపిణీ, పరీక్ష అనంతరం పోలిసు బందోబస్తుతో తరలించడం వంటివి పక్కాగా చేయాలని, అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడానికి తమ కేంద్రాల ఏ.యెన్.ఎం. పోలీసుల మొబైల్ నెంబర్లు తీసుకోవాలని సూచించారు. కరోనా తరువాత కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మొదటగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం 12 పేపర్ల నుండి 6 పేపర్లకు కుదించడంతో పాటు పరీక్షా సమయం కూడా అరగంట ఎక్కువ పెంచిందని అన్నారు. కాబట్టి విద్యార్థులు సుష్టిగా భోజనం చేసి (కడుపునిండా) అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు, సిబ్బంది ఎవరు కూడా పరీక్షా కేంద్రాలకు చరవాణి తీసుకెళ్ళుటకు అనుమతి లేదన్న విషయాన్ని విస్మరించరాదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణ సులభంగానే ఉంటుందన్న భావన విడనాడాలని, ఏ చిన్న పొరపాటు చేసిన చాలా సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని , కాబట్టి అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తతో ఉంటూ పరీక్షలు విజయవంతంగా నిర్వహించుటలో సహకరించవలసినదిగా కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వర్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, సెక్టోరల్ అధికారి సుభాష్, సూర్యప్రకాష్, ఎం.ఈ.ఓ.లు నీలకంఠం, యాదగిరి, బిచ్యా నాయక్, చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 27 నుంచి 30 వరకు డై మోల్డ్ ఇండియా ఎగ్జిబిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 22: టూల్ మేకర్స్ కు వ్యాపార అవకాశాలను అన్వేషించడమే లక్ష్యంగా టూల్ అండ్ గేజ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టాగ్మా ఇండియా) ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 30 వరకు ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో డై మోల్డ్ ఇండియా ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు టాగ్మా ప్రెసిడెంట్ షెరెగర్ తెలిపారు. తమ తాజా టెక్నాలజీని ప్రదర్శించే ప్రముఖ బ్రాండ్‌లు, సీఈవోలు, కన్సల్టెంట్‌లు, డెసిషన్ మేకర్స్ వంటి సందర్శకుల క్రమబద్ధమైన భాగస్వామ్యంతో డై మోల్డ్ నిపుణుల కోసం ఒక-స్టాప్ షాప్‌గా పేరుగాంచిందన్నారు. మహమ్మారి ఇప్పటికీ సవాలుగానే ఉండటంతో భారతీయ తయారీదారులు తమ వ్యాపారాలను సమూలంగా మార్చడానికి తమను తాము వేరు చేసుకోవడానికి కొత్త మార్గాలను కనుగొనడానికి వివిధ విధానాలను తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కంపెనీలు కచ్చితత్వాన్ని సాధించడం కోసం, సమయాన్ని తగ్గించడంలో సహాయపడే సాంకేతికతల కోసం నిరంతరం వెతుకుతున్నాయన్నారు. స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సొల్యూషన్‌లు, కొత్త టూల్ జ్యామితులు, సరికొత్త సీఎన్‌సీ మెషిన్‌లు, సంకలిత తయారీ సొల్యూషన్‌లు, ఇంటిగ్రేటెడ్ ఆటోమేషన్ సొల్యూషన్‌లను ప్రదర్శించడానికి కంపెనీలు సిద్ధమవుతున్నందున, డై మోల్డ్ ఇండియా యొక్క 2022 ఎడిషన్ టూలింగ్ రంగంలో తాజా అభివృద్ధిని హైలైట్ చేస్తుందన్నారు. 300పైగా ఎగ్జిబిటర్లు తమ సాంకేతికతలను పరిష్కారాలను ప్రదర్శిస్తున్నందున, ఈ ఎడిషన్ గొప్ప విజయాన్ని సాధిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా టాగ్మా వైస్ ప్రెసిడెంట్ షణ్ముగసుందరం మాట్లాడుతూ వివిధ భాగాల భారీ ఉత్పత్తికి అవసరమైన డైలు, అచ్చులను అందించడం ద్వారా తయారీ విలువ గొలుసులో సాధన పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తద్వారా పారిశ్రామిక వృద్ధికి వెన్నెముకగా ఉంటుందన్నారు. టాగ్మా ఇండియా, నోమురా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, లిమిటెడ్ సంకలనం చేసిన తాజా ఇండియన్ టూలింగ్ రిపోర్ట్ ప్రకారం.. భారతీయ టూలింగ్ పరిశ్రమ మార్కెట్ పరిమాణం 18 వేల కోట్లు ఉందన్నారు. మొత్తం డిమాండ్‌లో సగానికి పైగా ఆటోమోటివ్ ఆటో కాంపోనెంట్స్ రంగానికి ఆపాదించబడిందన్నారు. డై మోల్డ్ ఇండియా ఎగ్జిబిషన్ అనేది టూల్ అండ్ డై మేకర్స్ కోసం మాత్రమే అంకితమైన ఈవెంట్ అన్నారు, ఇది విభిన్న పరిశ్రమల నుంచి సందర్శకులను ఆకర్షిస్తుందన్నారు. మేము 50పైగా ఓఈఎంలు, పబ్లిక్ సెక్టార్, 10పైగా యూజర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌ల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. భారతదేశం గత కొన్ని సంవత్సరాలుగా టూలింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ని చూస్తోందన్నారు. అయినప్పటికీ, గణనీయమైన సంఖ్యలో సాధనాలు ఇప్పటికీ దిగుమతి చేయబడుతున్నాయన్నారు. స్వదేశీ తయారీని ప్రోత్సహించడం ఉపాధి కల్పన వంటి ప్రయోజనాలను అందిస్తుందన్నారు. దేశీయ యంత్రాల తయారీదారుల అభివృద్ధి, ఆర్ అండ్ డీ ని పెంచడం సరఫరా గొలుసు అసమర్థతలను, నష్టాలను తగ్గించడం ఉందన్నారు. అందువల్ల, భారతదేశం తన తయారీ పరిశ్రమను మెరుగుపరచుకోవడానికి బలమైన సాధన పరిశ్రమను కలిగి ఉండటం తప్పనిసరి అన్నారు. రాబోయే డై మోల్డ్ ఇండియా షోలో భారతీయ టూలింగ్ పరిశ్రమ దాని సామర్థ్యాలను పెరుగుతున్న అవకాశాల కోసం సంసిద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. ప్రదర్శన ఎగ్జిబిట్ శ్రేణిలో డైస్ ఉ మౌల్డ్స్, ప్రెస్ టూల్స్, మోల్డ్ బేస్ స్టాండర్డ్ పార్ట్స్ ఆఫ్ డైస్ మౌల్డ్స్, హాట్ రన్నర్ సిస్టమ్, టూల్ స్టీల్, హీట్ ట్రీట్‌మెంట్, టెక్స్‌చరైజింగ్, గేజ్‌లు, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, కట్టింగ్ టూల్స్, కొలిచే యంత్రాలు, పదార్థాలు, పరికరాలు, ఉపకరణాలు ఉ సేవలు డై ఉ మోల్డ్ పరిశ్రమను కవర్ చేస్తాయన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com